
టాప్ న్యూస్

## అల్లు అర్జున్ అరెస్ట్‌పై పవన్ కళ్యాణ్



- జనాలు చచ్చిపోతే సినిమా గురించి మాట్లాడుతారా?
- మీడియాకు పవన్ చురకలు

02


## తెలంగాణపై మన్మోహన్ ముద్ర



- హైదరాబాద్‌కు ఓఆర్ఆర్, మెట్రో మన్మోహన్ ఘనతే
- ఎంపీ చామల

02

## కవిత.. నాటకాలు ఆపు



- బీసీలకు మీ నాయకత్వం అవసరం లేదు
- రిజర్వేషన్లు సాధించుకునే సత్తా మాకు ఉంది
- విప్ ఆది శ్రీనివాస్

02

ANN తెలుగు
Follow: @ANNTELUGU
29-12-2024
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 28 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



**కంది రామచంద్రారెడ్డి**
**వీకెండ్ అనాలసిస్**

భారతదేశ రాజకీయాల్లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రత్యేకం. భారత ఆర్థిక దుస్థితికి చికిత్స చేసిన నిజమైన డాక్టరు ఆయన. కౌటిల్యుని అర్థశాస్త్రానికి తొలి డాక్టరేట్ ఇచ్చిన ఆచార్యుడు ఆయన. అతను ఎక్కడ కూర్చున్న అదే సింహాసనం. మాట్లాడకుంటే మాటలు పడిపోతాయి కానీ మాట్లాడకుండానే ప్రభుత్వాన్ని పదేళ్లు పడిపోకుండా నిలబెట్టిన ఒకే ఒక్కడు.. మగాడు అతడు. మౌనంగా.. మహోన్నతంగా రాజకీయాలు చేసిన దురంధరుడు. హైదరాబాద్ ఓఆర్ ఆర్ , హైదరాబాద్ మెట్రో, ఐఐటి హైదరాబాద్ ఇలాంటి ప్రతిష్టాత్మక గేమ్ ఛేంజర్లకు బీజం ఆయనే. ఆర్థికసంస్కరణలతో దేశ ఆర్థికరథాన్ని, తెలంగాణ ప్రగతిచిత్రాన్ని మార్చిన మహోన్నతుడు మౌనంగా వెళ్ళిపోయినా ఆయన విజయాలను స్మరించుకుంటోంది తెలంగాణ.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో







# మన్మోహన్‌కు కన్నీటి వీడ్కోలు

**అధికారలాంఛనాలతో అంత్యక్రియలు.. ముగిసిన మహానేత చివరి మజిలీ**

అంతిమసంస్కారాలకు హాజరైన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్ ఖడ్ , ప్రధాని నరేంద్ర మోదీ, భూటాన్ రాజు
నివాళులు అర్పించిన సోనియా, ఖర్గే, రేవంత్, సిద్దరామయ్య.. పాడెమోసిన రాహుల్ గాంధీ


**ఢిల్లీ, మహా:** సంస్కరణలతో దేశార్థికాన్ని నవ్యపథంలో నడిపించిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు యావత్ భారతావని కన్నీటి వీడ్కోలు పలికింది. భారత ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చివరి మజిలీ ముగిసింది. ఢిల్లీలోని నిగమ్ బోధ్ ఘాట్ లో మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు ముగిశాయి. కేంద్ర ప్రభుత్వ అధికారలాంఛనాలతో మన్మోహన్ పార్థివదేహానికి అధికారులు అంత్యక్రియలను పూర్తిచేశారు. అంతిమ సంస్కారాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధన్ ఖడ్ , ప్రధాని నరేంద్ర మోదీ, భూటాన్ రాజు, లోక్సభ స్పీకర్ ఓంబిర్లా సహా ఇతర కేంద్రమంత్రులు హాజరయ్యారు. కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్తో పాటు ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, సిద్దరామయ్య, ఢిల్లీ సీఎం అతిశీ, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యారు. భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మిగతా 2లో

## పాడె మోసిన రాహుల్

మన్మోహన్ బంధువులు, మతపెద్దలతో పాటు రాహుల్ గాంధీ పాడే మోస్తూ నిగమ్ బోధ్ ఘాట్ లో చితి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ సిక్కు మత సంప్రదాయాల ప్రకారం ప్రార్థనలు నిర్వహించిన అనంతరం చితిని పేర్చి పార్థివదేహాన్ని దహనం చేశారు.

# కేటీఆర్‌కు ఈడీ షాక్



**జనవరి 7న విచారణకు రావాలని నోటీసులు**

**2న అరవింద్ కుమార్, 3న బిఎల్ఎన్ రెడ్డి విచారణ**

**నిబంధనలు తుంగలో తొక్కిన కేటీఆర్– ఏసీబీ కౌంటర్ అఫిడవిట్**

**బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన**

**హైదరాబాద్, మహా:** ఫార్ములాఈ కార్ రేసింగ్ కేసు లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ కు ఈడీ నోటీసులు జారీ చేసింది. 7 జనవరి, 2025న తమ ఎదుట విచారణకు హాజరు కావాలని ఈడీ నోటీసుల్లో తెలిపింది. సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ , హెచ్ఎమ్ డీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి కి సైతం ఈడీ నోటీసులు అందచేసింది. వారిద్దరినీ జనవరి 2, 3 తేదీల్లో విచారణకు రావాలని చెప్పింది. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా పీఎంఎల్ఏ కింద వారిని ఈడీ విచారణ చేయనుంది. ఫార్ములాఈ కార్ రేస్ వ్యవహారంలో వీరంతా ఫెమా నిబంధనలు ఉల్లంఘించినట్లు ఈడీ ఇప్పటికే గుర్తించింది. ఎఫ్ఈవోకు నగదు బదిలీ తోపాటు ఆర్థిక అవకతవకలు జరిగినట్లు ఈడీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే వారికి నోటీసులు ఇచ్చి విచారణకు రావాలని ఆదేశించింది. కేటీఆర్ ను విచారణతో సరిపెడుతుందా? ఈడి అరెస్ట్ చేస్తుందా? అన్నదానిపై బిఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### ఏసీబీ కౌంటర్ అఫిడవిట్..

ఫార్ములాఈ కార్ రేస్ వ్యవహారంలో ఏసీబీ కౌంటర్ అఫిడవిట్‌ను హైకోర్టు ముందుంచింది. ఈ సందర్భంగా మంత్రి హోదాలో కేటీఆర్ చేసిన తప్పులు, సచివాలయ బిజినెస్ రూల్స్ ఉల్లంఘన, ఆర్థిక శాఖను బేఖాతర్ చేసిన వైనాన్ని హైకోర్టు ముందుంచింది. విదేశీ కరెన్సీ సహా అనేక ఉల్లంఘనలకు కేటీఆర్ పాల్పడ్డారని తెలిపింది.

మిగతా 2లో



## తెరపైకి ఇండియా ఫస్ట్ వివాదం

**మహా:** వలస విధానంపై ట్రంప్ కూటమిలో నిప్పు రాజుకుంది. టాప్ టాలెంట్ ఎక్కడున్నా USకు ఆహ్వానించాలని మస్క్, వివేక్ అంటున్నారు. మెరిట్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ అవసరమని, భారత్లాంటి దేశాలకు పరిమితి విధించొద్దని సూచిస్తున్నారు. అమెరికన్ల ప్రతిభకేం తక్కువంటున్న ట్రంప్ సపోర్టర్స్ వీసాలపై పరిమితి ఉండాలని వాదిస్తున్నారు. గతంలో 'INDIA FIRST' అంటూ ట్వీట్ చేసిన శ్రీరామ్ కృష్ణన్ AI సలహాదారుగా ఎంపికవ్వడంతో రచ్చ మొదలైంది.

## ఈ నెల 30న తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

**మన్మోహన్‌కు నివాళి**

**కేబినెట్ భేటీ వాయిదా**

**హైదరాబాద్, మహా:**

తెలంగాణ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఈ నెల 30వ తేదీన జరగనుంది. సోమవారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. సంతాప దినాల్లో భాగంగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శాసన సభ నివాళులర్పించనుంది. మరోవైపు సంతాపదినాల నేపథ్యంలో 30న జరగాల్సిన కేబినెట్ భేటీని వాయిదా వేశారు.



## బొకేలు వద్దు.. పుస్తకాలు ముద్దు

**హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను సందర్శించిన గవర్నర్**

నేటి యువత పుస్తకాల వైపు మళ్లాలి – జిష్ణుదేవ్ వర్మ

02

## కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటాయ్

- చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్
- ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్
- హైడ్రా కమిషనర్ రంగనాథ్



**హైదరాబాద్:** కొత్త సంవత్సరంలో హైడ్రా మరింత దూకుడు పెంచుతుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటాయని స్పష్టం చేశారు.

మిగతా 2లో

# తెలుగోడి దెబ్బ



తెలుగోడి దమ్మేంటో మరోమారు చూపించాడు నితీష్ కుమార్ రెడ్డి. మనతో పెట్టుకుంటే దబిడిదిబిడేనని ప్రూవ్ చేశాడు. మ్యాచ్ తమదే అని ధీమాతో ఉన్న కంగారూలకు ఒక రేంజ్‌లో పోయించాడు. ఓటమి అంచున ఉన్న జట్టును కాపాడి.. గెలుపుపై అంచనాలు పెంచాడు. హాఫ్ సెంచరీ పూర్తయ్యాక 'పుష్ప' మూవీలోని అల్లు అర్జున్ సిగ్నేచర్ స్టైల్‌లో బ్యాట్‌తో తగ్గేదేలే అంటూ బ్యాట్‌తో గడ్డాన్ని సవరించాడు. మూడంకెల మార్క్‌ను అందుకోగానే 'బాహుబలి', 'సలార్'లో ప్రభాస్ మాదిరిగా బ్యాట్‌ను నేలకు ఆనించి.. పైకి చూసి దేవుడ్ని తలచుకున్నాడు. అతడి బ్యాటింగ్, టాలీవుడ్ పొగరు చూపిస్తూ చేసిన సెలబ్రేషన్స్, స్వాగ్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఇదీ తెలుగోడి దెబ్బ అని నితీష్ సెలబ్రేషన్, ఇన్నింగ్స్‌ను చూసిన అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

వివరాలు 7లో

# మన్మోహన్‌కు కన్నీటి వీడ్కోలు



(మొదటిపేజీ తరువాయి)

పిసిసి చీఫ్ మహేష్ గౌడ్, మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు నివాళులు అర్పించారు. వారంతా వరుసగా మన్మోహన్ పార్థివదేహానికి సైనిక లాంఛనాల నడుమ పుష్పగుచ్ఛాలు సమర్పించారు. అనంతరం మన్మోహన్ పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పుష్పగుచ్ఛం సమర్పించి సెల్యూట్ చేశారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ తో పాటు త్రివిధ దళాధిపతులు మన్మోహన్ భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించారు. తర్వాత గౌరవ వందనం చేసిన త్రివిధదళాల అధికారులు పేటికపై ఉన్న పూలు, జాతీయ జెండాను తొలగించారు.

**ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో పార్థీవ దేహం**

అంతకుముందు ప్రజల సందర్శనార్థం మన్మోహన్ సింగ్ పార్థివదేహాన్ని ఆయన నివాసం నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ మన్మోహన్ సింగ్ భౌతిక కాయానికి కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులు నివాళులర్పించారు. అలాగే మన్మోహన్ పార్థివ దేహానికి ఆయన భార్య, కుటుంబ సభ్యులు సైతం నివాళులర్పించారు.

**జో బైడెన్ సంతాపం**

మన్మోహన్ సింగ్ మృతికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంతాపం తెలిపారు. అమెరికా, భారత్ మధ్య సంబంధాలను బలోపేతం చేయడంలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని బైడెన్ కొనియాడారు. మాజీ ప్రధాని సతీమణి గురుశరణ్ సింగ్, కుటుంబసభ్యులకు బైడెన్ దంపతులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు వైట్ హౌస్ ఓ ప్రకటన విడుదల చేసింది.

## ప్రముఖుల నివాళులు

**భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్ లో కన్నుమూశారు. అనంతరం మన్మోహన్ పార్థివదేహాన్ని ఢిల్లీలోని ఆయన నివాసానికి తరలించారు. అక్కడే శుక్రవారం అంతా ఉంచారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి జగ్ దీప్ ధన్ ఖడ్, కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, సోనియా గాంధీ సహా ఇతర పార్టీల నాయకులు మన్మోహన్ బౌతికకాయానికి నివాళులర్పించారు. శనివారం ఉదయం ప్రజల సందర్శనార్థం మన్మోహన్ పార్థివదేహాన్ని ఏఐసీసీ కార్యాలయానికి తరలించారు. మన్మోహన్ అంత్యక్రియల్లో కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు తదితరులు పాల్గొన్నారు.**

# కేటీఆర్‌కు ఈడి షాక్

(మొదటిపేజీ తరువాయి)

సచివాలయ బిజినెస్ రూల్స్ 9, 11 ప్రకారం నిర్ణీత మొత్తం కన్నా ఎక్కువగా ఏ శాఖ అయినా ఖర్చు చేయాల్సి వస్తే ఆర్థిక శాఖ అనుమతి తీసుకోవాలని తెలిపింది. మంత్రివర్గం అనుమతి తర్వాతే ఆర్థిక శాఖ సైతం నిధులను విడుదల చేయాలని ఏసీబీ వెల్లడించింది. ఈ నిబంధనలన్నీ కేటీఆర్ తుంగలో తొక్కారని హైకోర్టుకు ఏసీబీ వివరించింది. విచారణ అనంతరం కేటీఆర్‌ను డిసెంబర్ 31 వరకూ అరెస్టు చేయొద్దని ఏసీబీకి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే ఈ కేసు విషయమై హైకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఒకవేళ డిసెంబర్ 31 లోపు క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేస్తే నోటీసులు ఇవ్వకుండానే ఆయన్ని ఏసీబీ అరెస్టు చేసే అవకాశం ఉంటుంది. ఈడి నోటీసులపై బిఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన నెలకొంది.

### తండ్రి కోసం పాట పాడిన హిమాన్షు

**గర్వంగా ఉందంటూ కేటీఆర్ ప్రశంసలు**

**మహా:** ఈ కష్టతరమైన సంవత్సరంలో నాకు దక్కిన ఉత్తమ బహుమతి అని కేటీఆర్ హిమాన్షు పాడిన పాటను ప్రశంసించారు. తన గాత్రంతో ఉత్తమ బహుమతి అందించిన బింకు(హిమాన్షు)కి ధన్యవాదాలు తెలిపారు. ఓ తండ్రిగా గర్వపడుతున్నానని పేర్కొన్నారు.కేటీఆర్ బర్త్ డే కానుకగా జూలైలోనే హిమాన్షు ఓ పాటను పాడాడు. యానిమల్ మూవీలోని ‘ ఓ నాన్న నువ్వు నా ప్రాణం’ అనే పాటను రికార్డు చేశాడు. అయితే ఆ పాటను తాజాగా కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా పంచుకున్నారు. తన బర్త్ డే కానుకగా తన కొడుకు హిమాన్షు రావు ఈ పాటను పాడాడని పేర్కొన్నారు. కానీ అది సంతృప్తికరంగా రాలేదని భావించి విడుదల చేయలేదని చెప్పారు. అయితే ఆ పాటను తాను వారం క్రితం మొదటిసారి విన్నానని, హిమాన్షు గానం, పాటలోని సాహిత్యం అద్భుతంగా ఉందని తెలిపారు.

# తిరుమల శ్రీవారి అన్నప్రసాదానికి విరాళాలు

**కియోస్క్ మెషిన్ల ద్వారా భక్తులు డొనేషన్లు.. 50 రోజుల్లో రూ.55 కోట్లు విరాళాలు వచ్చాయి**



**తిరుమల, మహా :** తిరుమలలోని అన్నప్రసాదం ట్రస్టుకు విరాళాలు అందించేందుకు టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. అన్నప్రసాదం కేంద్రంలో కియోస్క్ మెషిన్లు ఏర్పాటు చేయగా భక్తుల నుంచి భారీగా విరాళాలు సమకూరాయి. ఈ మేరకు టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది. టీటీడీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ.1 నుండి రూ.లక్షలోపు విరాళం ఇవ్వదలచిన భక్తుల కోసం సులభతరంగా విరాళం ఇచ్చేందుకు వీలుగా తిరుమలలోని శ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో కియోస్క్ మెషిన్లు (సెల్ఫ్ ఆపరేటెడ్ ఆన్ లైన్ పేమెంట్) ఏర్పాటు చేసినట్లు 'తెలిపారు. ఈ మెషిన్ల ద్వారా అన్న ప్రసాదం ట్రస్టుకు 50 రోజుల్లో రూ.55 లక్షలు విరాళం అందింది. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, ఒంటిమిట్ట కోదండ రామాలయం, బెంగుళూరులో శ్రీవారి ఆలయంలో కూడా ఈ మిషన్లు ప్రారంభించారు. ఈ మూడు ఆలయాల్లో ఈ మెషిన్ల ద్వారా 15 రోజుల్లో రూ.5 లక్షలు విరాళంగా అందింది. తాజాగా పేరూరు సమీపంలోని శ్రీ వకుళామాత ఆలయంలో కూడా ఈ కియోస్క్ మెషిన్ ను ప్రారంభించారు. మరో వారం రోజుల్లో విజయవాడ, చెన్నై, హైదరాబాద్ లోని శ్రీవారి ఆలయాల్లో కియోస్క్ మెషిన్లను భక్తులకు అందుబాటులో తీసుకురానున్నారు. ప్రస్తుతం అన్న ప్రసాదం ట్రస్టుకు మాత్రమే విరాళం ఇచ్చే అవకాశం ఉంది. త్వరలో టీటీడీ ఆలయాల్లోని అన్ని సేవలకు ఈ మెషిన్ల ద్వారా నగదు రహిత చెల్లింపు చేసే విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తాం అని టీటీడీ ఒక ప్రకటనలో పేర్కొంది.

**వైకుంఠ ద్వార దర్శన టికెట్ల కోసం ప్రత్యేక కౌంటర్లు**

తిరుమల వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి.. భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అదేవిధంగా తిరుమల స్థానికుల కొరకు తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో టోకెన్ కౌంటర్లు ఏర్పాటు చేశామని టీటీడీ ఈవో జే శ్యామలరావు తెలిపారు. తిరుపతిలోని ఈ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు, బారికేడ్లు, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నాం. సర్వదర్శనం టోకెన్ల కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయానికి తిరుమలకు వచ్చి స్వామివారి దర్శించుకోవాలని విజ్ఞప్తి. గోవిందమాల భక్తులు కూడా దర్శన టోకెన్లు పొంది దర్శనానికి రావాల్సి ఉంటుంది. దర్శనటోకెన్లు గల భక్తులను మాత్రమే తిరుమల శ్రీవారి దర్శనానికి అనుమతించడం జరుగుతుంది. భక్తులు ఈ విషయాన్ని గుర్తించాలి. చంటిపిల్లల తల్లిదండ్రులతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, రక్షణ సిబ్బంది తదితర ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజులపాటు రద్దు చేశాం. భక్తుల అధిక రద్దీ దృష్ట్యా ఈ 10 రోజులలో విఐపి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించబడవు, అయితే ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే వారికి మాత్రం శ్రీవారి దర్శనం కల్పిస్తాం. తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగుతుంది. జనవరి 10న వైకుంఠ ఏకాదశి నాడు ఉదయం 9 నుండి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు స్వర్ణరథంపై ఆలయ నాలుగుమాడ వీధులలో భక్తులకు దర్శనమిస్తారు. జనవరి 11న వైకుంఠ ద్వాదశి సందర్భంగా ఉదయం 5.30 నుండి 6.30 గంటల వరకు చక్ర స్నానం నిర్వహిస్తామని ఈవో వెల్లడించారు.

# కవిత.. నాటకాలు ఆపు

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**హైదరాబాద్, మహా:** బీసీలపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కపట ప్రేమ చూపిస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లపై హడావుడీ చేస్తున్న కవితకు బీసీలతో ఏం సంబంధమని ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కవితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై కవిత మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. బీసీల రిజర్వేషన్ల గురించి మాట్లాడే కవిత ఇప్పుడు మాట్లాడుతున్నారు కానీ, బీఆర్ఎస్ హయాంలో ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. గిరిజనులు, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటూ కేసీఆర్ ప్రకటించినప్పుడు కవిత ఎందుకు బీసీల గురించి ప్రస్తావించలేదన్నారు. బీసీల అభివృద్ధి కోసం ఎందుకు చర్యలు తీసుకోలేదన్నారు. బీసీల గురించి ఆమె పోరాడాల్సిన అవసరం ఏముందని, బీసీలు తమ హక్కులు, రిజర్వేషన్ల కోసం పోరాడే పటిమ బీసీ నాయకులకు ఉందని తేల్చి చెప్పారు. బీసీ సహా రాష్ట్రంలో అన్ని కార్పొరేషన్లను బీఆర్ఎస్ హయాంలో నిర్వీర్యం అయ్యాయన్నారు. ఎన్నికల సమయంలో బీసీల ఓట్ల బీసీ బంధు అంటూ డ్రామా ఆడారన్నారు. బీసీల లెక్కలు తేల్చేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సూచనలతో సీఎం రేవంత్ రెడ్డి కులగణన చేపట్టారన్నారు. కులగణనతో దేశానికి తెలంగాణ రోల్ మోడల్ గా మారిందన్నారు. సర్వేలో బీఆర్ఎస్ నాయకులు ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. బీసీల కోసం వచ్చే నెల 3న ధర్నా చేస్తామంటున్న కవిత నాయకత్వం బీసీలకు అవసరంలేదన్నారు. తమ సమస్యలు తాము పరిష్కరించుకునే శక్తి తమ బీసీలకు ఉందన్నారు. కుల గణన లెక్కలు తేలిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో బీసీలకు చేయాల్సిన న్యాయం చేస్తామని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే విషయమై కసరత్తు జరుగుతుందన్నారు. కవిత కేవలం లిక్కర్ కేసు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే బీసీ ఉద్యమాలతో నాటకాలు వేస్తున్నారన్నారు. గతంలో కూడా ఆమె వచ్చాకే బతుకమ్మ వచ్చినట్లుగా ప్రజలను మభ్యపెట్టిన సంగతిని మరువరాదన్నారు. కొంతమంది బీసీ నాయకులను పక్కన పెట్టుకుని బీసీ జపం చేసినంత మాత్రాన కవితను బీసీలు నమ్మరన్నారు.



# మందుబాబులకు గుడ్‌న్యూస్ చెప్పిన రేవంత్ సర్కార్

**అర్ధరాత్రి 12 గంటల వరకు వైన్ షాప్స్**


**న్యూ ఇయర్ గిఫ్ట్**

**హైదరాబాద్, మహా:** మందు బాబులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. న్యూ ఇయర్ సందర్భంగా ఈనెల 31న అర్ధరాత్రి 12 గంటల వరకు వైన్ షాప్స్ ఓపెన్ ఉంటాయని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రపంచమంతా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు సిద్ధం అవుతోంది. కొత్త సంవత్సరానికి గ్రాండ్‌గా వెల్‌కం చెప్పేందుకు డిసెంబర్ 31న మందుబాబులు మందేసి చిందేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రంలో సైతం పెద్ద ఎత్తున న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కు ఏర్పాట్లు గ్రాండ్‌గా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం న్యూ ఇయర్ సందర్భంగా డిసెంబర్ 31న రాష్ట్రంలోని వైన్ షాపులు అర్ధరాత్రి 12 గంటల వరకు తెరిచి ఉండనున్నాయి. ఈ మేరకు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్రంలోని బార్లు, పబ్‌లు, రెస్టారెంట్లు న్యూ ఇయర్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అనుమతితో నడిచే ఈవెంట్లకు రాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలకు కాంగ్రెస్ సర్కార్ పర్మిషన్ ఇచ్చింది.

# బొకేలు వద్దు.. పుస్తకాలు ముద్దు

**హైదరాబాద్ బుక్ ఫెయిర్ ను సందర్శించిన గవర్నర్**

**నేటి యువత పుస్తకాల వైపు మళ్లాలి - జిష్ణుదేవ్ వర్మ**



**హైదరాబాద్, మహా:** ఏదైనా శుభకార్యాలకు వెళ్లినప్పుడు బహుమతులకు బదులు పుస్తకాలను ఇవ్వాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సూచించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'పుస్తకాల్లో అనంతమైన జ్ఞానం ఉంటుంది. పుస్తకాలను నమిలి మింగేసేంత క్షుణ్ణంగా వాటిని చదవాలి. ఈబుక్స్‌లలో కంటే పుస్తకాల్లోనే ఎక్కువ మజా ఉంటుంది. పుస్తకాలను చదువుతుంటే రచయితతో నేరుగా మాట్లాడుతున్నట్లుగా ఉంటుంది. విశ్వం గురించి తెలియాలంటే పుస్తకాలు చదవాలి. నిరక్షరాస్యులకు ఆడియో బుక్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి. నేటి యువత పుస్తకాల వైపు మళ్లాలి. పెద్దలు కూడా ఆ దిశగా వారిని ప్రోత్సహించాలి' అంటూ గవర్నర్ పేర్కొన్నారు. ఇదిలా ఉంటే.. డిసెంబర్ 29తో హైదరాబాద్ బుక్ ఫెయిర్ ముగియనుంది. ఈ నెల 19న దీనిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. హరియానా గవర్నర్ బండారు దత్తాత్రేయతోపాటు రాష్ట్ర మంత్రులు, ప్రముఖులు ఈ బుక్ ఫెయిర్ ను సందర్శించారు.

# మద్యం మత్తులో తోటి హోంగార్డ్ పై కానిస్టేబుల్ దాడి



**పల్నాడు, మహా :** విధి నిర్వహణలో ఉన్న హోంగార్డుపై మద్యం మత్తులో ఉన్న ఏపీఎస్పీ కానిస్టేబుల్ విచక్షణా రహితంగా లాఠీతో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఏపీలోని పల్నాడు మాచర్లలో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నైట్ బీట్ నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీనివాస్ వద్దకు కానిస్టేబుల్ మల్లిఖార్జున పీకలదాకా మద్యం తాగి వచ్చి అకారణంగా అతనిపై దాడికి పాల్పడినట్లు సమాచారం. బాధిత హోంగార్డు వద్దని వారిస్తున్నా వినకుండా కానిస్టేబుల్ మల్లిఖార్జున కర్రతో అతని మీద దాడి చేశాడు. దీనికి సంబంధం చిన వీడియో దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. కాగా, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక పట్టణ సీఐ తెలిపారు ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, దాడికి గల అసలు కారణం ఏమిటన్నది తేలిచే శాఖాపరమైన చర్యలుంటాయని అధికారులు వివరించారు.

# కూల్చివేతలు ఆగలేదు.. ఇంకా ఉంటాయ్



(మొదటిపేజీ తరువాయి)

చెరువుల హద్దులపై గ్రౌండ్ వర్క్ జరుగుతోందని అన్నారు. స్పష్టత రాగానే హైడ్రా యాక్టివ్‌గా ఉంటుందని తెలిపారు. చెరువులను అభివృద్ధి చేస్తూ.. అక్రమ నిర్మాణాలు కూల్చేస్తామని స్పష్టం చేశారు. ఎఫ్ టి ఎల్ నిర్ధారణ అనంతరం అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తామని చెప్పారు. ఇందుకోసం 15 హైడ్రా బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. భాగ్యనగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుందని తేల్చిచెప్పారు. అక్రమ నిర్మాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించామని తెలిపారు. 2024 జూలై 19వ తేదీన హైడ్రా ఆవిర్భవించిందని అన్నారు. హైడ్రా 5 నెలల పని తీరు, వచ్చే ఏడాది కార్యాచరణను ప్రకటిస్తున్నామని రంగనాథ్ తెలిపారు. శనివారం హైడ్రా కార్యాలయంలో రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. ఓఆర్ ఆర్ లోపల.. 2050 కిలోమీటర్ల పరిధి.. తెలంగాణలో 33 శాతం హైడ్రా పరిధిలోకి వస్తుందని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటికే 200 ఎకరాల భూమిని కాపాడిందని గుర్తుచేశారు.

### ఆక్రమణలపై చర్యలు..

**“27 పురపాలక సంఘాలపై కూడా మాకు అధికారం ఉంది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ఆక్రమణలను గుర్తిస్తున్నాం. భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌పై కూడా దృష్టి పెట్టాం. 2025లో జియో ఫెన్సింగ్ సర్వే చేస్తాం. 12 చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. త్వరలోనే 72 డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులోకి వస్తాయి. నాగోల్‌లో ఉన్న డీఆర్ఎఫ్ కేంద్రాన్ని బలోపేతం చేస్తాం. త్వరలోనే నగరంలో మరో డాప్లర్ వెదర్ రాడార్ రాబోతుంది. వెదర్ డాటాను విశ్లేషించేందుకు హైడ్రాలో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నాం. హైడ్రాకు త్వరలో ఒక ఎఫ్ఎం ఛానల్‌కు ప్రయత్నిస్తున్నాం. హైడ్రా వల్ల ప్రజల్లో భూములు, ఇల్లు క్రయవిక్రయాలపై అవగాహన పెరుగుతుంది. నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై హైడ్రా కఠినంగానే ఉంటుంది. జూలై తర్వాత అనధికారికంగా, వ్యాపార వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించేవాటిపై చర్యలు తప్పవు. వచ్చే ఏడాది నుంచి ప్రతి సోమవారం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న షెడ్లపై ప్రజలెవరు అద్దెకు తీసుకోవద్దు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తున్నాం” అని రంగనాథ్ వెల్లడించారు.**

# మా అత్త త్వరగా చనిపోవాలి

**దేవుడి హుండీలో ప్రత్యక్షమైన నోటు.. ఆ కోరిక కోరుకుంది కోడలా..? అల్లుడా ..? మొదలైన చర్చ**



**బెంగళూరు, మహా :** దేవుడి హుండీలో డబ్బులు లెక్కిద్దామని తెరిచిన ఆలయ అధికారులకు అందులో ఓ నోటు కనిపించింది. అందులో తమ కోరికను రాసి వేశారు. ఆ నోటుపై ఉన్నది చదివి అక్కడున్నవారంతా ఒక్కసారిగా షాక్ అయ్యారు. దేవుడు దగ్గర చాలా మంది కోరికలు కోరుకుని.. ఆ కోరికలను మనసులోనే ఉంచుకుంటారు. అయితే కొంతమంది తమ కోరికలను పేపరుపై రాసి హుండీల్లో వేస్తుంటారు. కానీ కర్నాటకలోని కలబురిగి ప్రాంతంలో ఓ భక్తుడో, భక్తురాలో తెలియదు కానీ నోటు మీద తమ కోరికను రాసి హుండీలో వేశారు. అత్తగారు త్వరలో చనిపోవాలని దేవుడిని కోరుకున్నారు. ఇదే విషయాన్ని నోటు మీదు రాశారు. ఆలయ అధికారులు ఆ నోటును ఫొటో తీయడంతో ఇప్పుడు వైరల్ గా మారింది. కలబురిగి సమీపంలో అఫ్జర్ పూర్ తాలుకాలో గట్టారంగి అనే గ్రామం ఉంది. ఆ గ్రామంలో భాగ్యవంతి దేవి ఆలయం ఉంది. ఆ గ్రామం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఆ ఆలయానికి వస్తుంటారు. ఈ మధ్యే ఆ హుండీ తెరిచిన అధికారులు డబ్బులు లెక్కిస్తున్న సమయంలో 20 రూపాయల నోటు కాస్త బిన్నంగా కనిపించింది. ఆ నోటు ఏంటా అని తీసి చూశారు. దాని వెనక దేవుడా నా అత్త తొందరగా చనిపోవాలని రాసి ఉంది. ఆలయ అధికారులు ఈ 20 రూపాయల నోటు ఫోటో తీసిన కాసేపటికే సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఎక్కువ మంది పాపం ఆ అల్లుడు లేకపోతే ఆ కోడలు ఆ అత్త నుంచి ఎంత టార్చర్ అనుభవిస్తున్నారో అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరికొంత మంది దేవుడిని ప్రాణాలు తీయమని కోరడం విచిత్రం ఉందంటున్నారు. మొత్తానికి ఈ నోటు ఎవరు రాశారో కానీ..వారి కోరిక తీరాలా వద్దా అనేదానిపై అనేక చర్చలు మాత్రం జరుగుతున్నాయి.

# అల్లు అర్జున్ అరెస్ట్‌పై పవన్ కళ్యాణ్

**జనాలు చచ్చిపోతే సినిమా గురించి మాట్లాడుతారా?**

**మీడియాకు పవన్ చురకలు**



**మహా:** అల్లు అర్జున్ అరెస్ట్‌పై స్పందించాలంటూ మీడియా కోరగా, పవన్ కల్యాణ్ మీడియాకు చురకలంటించారు. ‘‘ఇక్కడ సందర్భం ఏమిటి? దానికి సంబంధించిన రిలవెంట్ ప్రశ్నలు అడగండి.. ఇక్కడ జనాలు చచ్చిపోతే సినిమా గురించి మాట్లాడతారా? కొంచెం పెద్ద మనసుతో ఆలోచించండి.. పెద్దగా ఆలోచించండి. సినిమాల కంటే పెద్ద విషయాలు చాలా ఉన్నాయి.. వాటి గురించి అడగండి. సినిమాలు కాకుండా వేరే విషయాలపై డిబెట్ పెట్టండి. ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న అరాచకాల గురించి మాట్లాడండి’’ అంటూ పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు.

# తెలంగాణపై మన్మోహన్ ముద్ర

**ఎంపీ చామల ట్వీట్**



**హైదరాబాద్, మహా:** తెలంగాణపై ప్రధానిగా మన్మోహన్ సింగ్ చెరగని ముద్ర వేశారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ట్వీట్ చేశారు. హైదరాబాద్ కు ఓఆర్ ఆర్, హైదరాబాద్ మెట్రో మన్మోహన్ సింగ్ ఘనతేనన్నారు. హైదరాబాద్ లో ఐటిఐఆర్ నెలకొల్పేందుకు విశేష కృషి చేశారని, గచ్చిబౌలి, మాదాపూర్, మణికొండ, నానక్ రామ్ గూడలలో ఐటి సెజ్, మెదక్ నల్లగొండలలో ఫార్మా సెజ్, సిరిసిల్ల టెక్స్ టైల్ పార్క్ మన్మోహన్ హయాంలోనే వచ్చాయన్నారు.


# అహంకారమే మా ఫార్ములా!!


బీఆర్ఎస్ వైఖరి చింత చచ్చినా పులుపు చావలేదన్నట్టుగా ఉన్నది. తాను లేకపోతే ఈ హైదరాబాద్ ఇలా అభివృద్ధి పథాన దూసుకుపోయేది కాదని కేటీఆర్ మైండ్ లో ఫిక్స్ అయిపోయారు. కనుక బ్లైండ్ గా పోతున్నారు. అధికారం కోల్పోయి ఏడాది గడచినా అహంభావం ఒక్క అంగుళం కూడా తగ్గడం లేదంటే అందుకు కారణం ధనబలం,మితిమీరిన విశ్వాసమే.'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చవట,సన్నాసి, చదువు రానోడు, మెడ మీద తలకాయ లేనోడు,'.... ఇలా అడ్డదిడ్డంగా కామెంట్లు చేస్తూ తన చౌకబారు తనాన్ని కేటీఆర్ ప్రతి సందర్భంలో ప్రదర్శిస్తూనే ఉన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిం తర్వాత 55 కోట్లను ఫార్ములా ఈ కారు రేసింగ్ సంస్థకు పంపించిన తీరు ఒక ఎత్తు అయితే దాన్ని సమర్థించుకుంటూ ఆయన చేసిన వ్యాఖ్యలన్నీ ఒక ఎత్తు.' నేనే కేబినెట్.ఆ డబ్బు విడుదల చేయాలని నేనే ఉన్నతాధికారులకు చెప్పాను' అని అప్పట్లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. అవసరమైతే జైలుకు వెళతానని, జైలులో యోగా,ధ్యానం చేసుకొని ఫిట్‌నెస్ పెంచుకొని ఆ తర్వాత పాదయాత్ర చేస్తానని చెప్పారు ఏసిబి కేసు నమోదు చేసిన వెంటనే హైకోర్టును ఆశ్రయించి తనపై పెట్టిన కేసు ఎత్తివేయాలంటూ వేడుకున్నారు.రోజుల వ్యవధిలో ఏమిటీ వైరుధ్యం? రోజుల తేడాతో ఏమిటీ మాటల మార్పు. ఆర్బీఐకి తెలియకుండా 55 కోట్లు విదేశాలకు తరలించడం 'ఫెమా' ఉల్లంఘన కిందకు వస్తుంది. అంటే ఎన్‌ఫోర్స్ మెంటు డైరెక్టరేట్ ను ఏరికోరి ఆహ్వానించినట్లే!

**ఇటు ఏసీబీ,అటు ఈడీ కేసులు చుట్టుముట్టడంతో కేటీఆర్ కాలుగాలిన పిల్లిలా మారారు. ఆయనకేమీ పాలుపోవడం లేదు. జైలుకు పోకుండా ఉండాలని బహుశా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశించారేమో అనే అనుమానాలు కలుగుతున్నవి. అది మరలా ఇంటి సమస్య. కేసీఆర్ కుటుంబ సమస్యలే,పార్టీ సమస్యలుగా,పార్టీ సమస్యలే కుటుంబ సమస్యలుగా మారిపోయిన ఒక వాతావరణం 2014 నుంచే కొనసాగుతున్నది.'కుటుంబ' పార్టీ ముద్ర నుంచి బయటపడలేకపోవడం ఒక కారణమైతే కేటీఆర్ జైలుకు పోవలసి వస్తే హరీశ్ రావు,లేదా కవిత పార్టీని 'హైజాక్' చేస్తారన్న భయం కేసీఆర్ కు ఉండవచ్చు. అందువల్ల కొడుకు జైలు ఊచలు లెక్కపెట్టకుండా తండ్రి ప్రయత్నాలు ముమ్మరం చేశారని,'ఢిల్లీ'తో టచ్ లోకి వెళ్లారంటూ తెలంగాణ భవన్ వర్గాల్లో ఒక వార్త భగ్గుమంటున్నది.**

ఫార్ములాఈ కారు రేసులో జరిగిన ఆర్థికతవకలపై కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదుకు ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకున్నది. గవర్నర్ నుంచి అనుమతి వచ్చాకే ఎసిబి రంగంలోకి దిగింది. ఈ వ్యవహారం పై మంత్రిమండలిలో చర్చ జరిగినట్టు ఉప్పందగానే కేటీఆర్ ఇంకా చెలరేగిపోయారు.'నలుగురు సన్నాసులు' కలిసి కూర్చొని తనపై ఎలాంటి కేసులు పెట్టాలో చర్చించారని రేవంత్ కేబినెట్ ను అవమానించారు. ఫార్ములా కేసులో చాలా కోణాలున్నవి. ఇందులో కనిపించని ప్రధాన కోణం దళిత అధికారుల పట్ల కేసీఆర్ హయాంలో చూపిన వివక్ష,నిర్లక్ష్య ధోరణి. తమ సామాజికవర్గ అధికారులు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో వెతికి,వెతికి గాలించి తీసుకువచ్చి ముఖ్యమైన పోస్టింగులు ఇచ్చి,ఆ పోస్టులలో,వాళ్ళు పనిచేస్తున్న చోటే ఏండ్ల తరబడి ఉండేలా ఉత్తర్వులు జారీ చెశారు. అలాగే పదవీ విరమణ చేసినా ఏండ్ల తరబడి ఆయా పోస్టుల్లోనే గడువు పొడిగిస్తూ పోవడం కేసీఆర్ హయాంలో మాత్రమే జరిగిన వింత.








**ఈ కేసులో ఐఏఎస్ అధికారి దానకిషోర్ వాంగ్మూలం కీలకం.కేసీఆర్, కేటీఆర్ హయాంలో తనకు జరిగిన అవమానాలపై ఆయన కసితో ఉన్నారని సెక్రటేరియట్ వర్గాలలో చర్చ జరుగుతోంది.కేటిఆర్ పెట్టిన క్షోభను తీర్చుకోవడానికి దళిత, బహుజన అధికారులు ప్రయత్నించకుండా ఎలా ఉంటారు.**

ఇదివరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పాలించిన ముఖ్యమంత్రులు తమ సామాజికవర్గానికి కొంత ప్రాధాన్యం ఇచ్చిన మాట నిజమే గానీ ఇట్లా ఇష్టా 'రాజ్యం'గా పరిపాలించిన ముఖ్యమంత్రి ఎవరూ లేరు.ఇకపై రారు. తెలంగాణ పౌరసమాజం తమను గమనిస్తున్నదని,ఉద్యమ పార్టీని,ఫక్తు రాజకీయ పార్టీగా మార్చిపారేసి,అవకాశవాదులను,'ప్రత్యేక తెలంగాణ' వ్యతిరేకులను చేరదీసి దానికి 'తెలంగాణ పునరేకీకరణ' అని నామకరణం చేసి పరిపాలించిన వ్యక్తి కేసీఆర్. ఆయన తానా అంటే తందానా అంటూ కొడుకూ,మేనల్లుడూ,ఇతర మంత్రులు,నాయకులు ఇలాంటి వైఖరి సరైంది కాదని,ఒక సామాజికవర్గానికి మాత్రమే పెద్దపీట వేసి,ప్రాధాన్యం ఇచ్చి దళితులు,బహుజన వర్గాల ఉద్యోగులు,అధికారులను శంకరగిరి మాన్యాలు పట్టించడం మంచిది కాదని చెప్పేదెవరు?వినేదెవరు?

కేసీఆర్ హయాంలో దళిత ఆఫీసర్లకు అడుగడుగునా అవమానం జరిగినట్టు,ఐఏఎస్, ఐపీఎస్లకు కీలక పోస్టులు ఇవ్వకుండా చిన్నచూపు చూసినట్టు,అప్రాధాన్య పోస్టుల్లోకి పంపుతూ చులకన చేసినట్టు,ఇతర వర్గాల వారికి ఎక్స్టెన్షన్లు,పెద్ద పోస్టులు ఇవ్వడం ఉత్తరాది వాళ్లకే ప్రాధాన్యం ఉన్న పదవులు కట్టబెట్టిన ఉదంతాలన్నీ అదృష్టవశాత్తు కాంగ్రెస్ అధికారంలోకి రావడం వలన,రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినందున వెలుగులోకి వస్తున్నవి.అలా కాకుండా కేసీఆర్ హ్యాట్రిక్ సాధించి ఉంటే బిఆర్ఎస్ నాయకులకు పట్టపగ్గాలు ఉండేవి కాదు.

తెలంగాణ ఏర్పడినపుడు ఇద్దరు దళితులు ఉప ముఖ్యమంత్రులు,చీఫ్ సెక్రటరీగా దళిత ఐఏఎస్ అధికారి ఉండేవారు. కీలక పదవుల్లోనూ దళిత వర్గానికి చెందిన ఐఏఎస్,ఐపీఎస్ ఆఫీసర్లు సేవలందించారు. దళితుడినే తొలి సీఎం చేస్తానని ప్రజలకు చెప్పి,తానే ఆ సీటులో కుర్చున్న కేసీఆర్ దళితుల్లో వ్యతిరేకతను తొలగించుకునేందుకు ఆ వర్గానికి చెందిన నాయకులు,ఆఫీసర్లకు ప్రయారిటీ ఇచ్చినట్టు కనిపించారు.నెమ్మదిగా తన విశ్వరూపం ప్రదర్శించారు ప్రభుత్వ పెద్దల అసలు రంగు బయటపడడానికి కొంత సమయం పట్టింది. రాజయ్యను డిప్యూటీ సీఎం పదవి నుంచి బర్తరఫ్ చేశారు.తర్వాత కడియం శ్రీహరికి ఆ పదవి ఇచ్చినా 'రెండో టర్మ్'లో ఏకంగా ఆ పోస్టునే లేకుండా చేశారు. రెండో టర్మ్ లో కేసీఆర్,కేటీఆర్ 'విజృంభణ' సాగింది. క్రమంగా దళిత ఐఏఎస్,ఐపీఎస్ అధికారులకు అవమానాలు మొదలయ్యాయి. కీలక పోస్టుల్లో ఉన్న వాళ్ళను 'లూప్లైన్'లోకి నెట్టివేయడం ప్రారంభమైంది. చీఫ్ సెక్రటరీగా పనిచేసిన ప్రదీప్ చంద్రకు ఎక్స్ టెన్షన్ ఇవ్వకుండా అగౌరవంగా వీడ్కోలు పలికారు. దళిత వర్గానికి చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు వీఆర్ఎస్ తీసుకోవటం కలకలం రేపింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో విద్యాకమిషన్ చైర్మన్ గా అణిచేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి,ఐపీఎస్ అధికారి,ప్రస్తుతం బిఆర్ఎస్ లో పనిచేస్తున్నఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ స్వచ్ఛందంగా రిటైర్మెంట్ తీసుకోవటం వెనుక దళిత ఆఫీసర్లను చులకనగా చూసిన తీరే కారణమన్న విమర్శలు ఉన్నవి.

తెలంగాణకు రెండో సీఎస్ గా నియమితులైన ప్రదీప్ చంద్ర కొత్త జిల్లాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఫైనాన్స్,రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా పని చేసిన ప్రదీప్ చంద్ర 2 నెలలే చీఫ్ సెక్రెటరీగా ఉన్నారు. ఆయనకు ఎక్స్టెన్షన్ ఇవ్వలేదు. కనీసం ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ ఇవ్వకుండా అవమానించారు. ఉత్తరాదికి చెందిన తొలి సీఎస్ రాజీవ్ శర్మకు రెండుసార్లు పదవీకాలం పొడిగించారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా కూడా ఆయనను నియమించుకున్నారు. ఆయనకు ఘనంగా సెక్రెటేరియట్ వీడ్కోలు పలికారు. అదే సమయంలో సీసీఎల్ఏ కమిషనర్గా ఉన్న రేమండ్ పీటర్ కు ఇలాంటి అన్యాయమే జరిగింది. తనను సలహాదారుగా నియమిస్తామని హామీ ఇచ్చారని పీటర్ పదవీకాలం చివరి రోజు వరకు ఎదురుచూసి భంగపడ్డారు. కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటు సమయంలో కీలక పాత్ర పోషించిన వీరిద్దరిని అమర్యాదకరంగా పంపించడం వెనుక దళితుల పట్ల 'వివక్ష' నిదర్శనమని విశ్లేషణలున్నవి.

**నేనే కేబినెట్.ఆ డబ్బు విడుదల చేయాలని నేనే ఉన్నతాధికారులకు చెప్పాను' అని అప్పట్లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. అవసరమైతే జైలుకు వెళతానని, జైలులో యోగా,ధ్యానం చేసుకొని ఫిట్‌నెస్ పెంచుకొని ఆ తర్వాత పాదయాత్ర చేస్తానని చెప్పారు ఏసిబి కేసు నమోదు చేసిన వెంటనే హైకోర్టును ఆశ్రయించి తనపై పెట్టిన కేసు ఎత్తివేయాలంటూ వేడుకున్నారు.రోజుల వ్యవధిలో ఏమిటీ వైరుధ్యం?**

తెలంగాణ ఏర్పడ్డప్పటి నుంచీ రాష్ట్రంలో ఉత్తరాది రాష్ట్రాల అధికారుల పెత్తనమే కొనసాగింది.తెలంగాణకు చెందిన దళిత,గిరిజన, మైనార్టీ,బీసీ ఐఏఎస్‌లంతా ఉత్తరాది పెత్తనంపై తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. అప్పటి చీఫ్ సెక్రటరీ ఎస్కే జోషిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అప్రాధాన్య పోస్టుల్లో తమను నియమించి,ఓసీలకు,ఉత్తరాది ఐఏఎస్ ఆఫీసర్లకు కీలక పోస్టులు ఇస్తున్నారని ఆవేదన చెందారు. 21 మంది ఐఏఎస్ అధికారులను 'దిక్కుమాలిన' పోస్టులలో నియమించారని ఫిర్యాదు చేయటం అప్పట్లో ఒక సంచలనం. జీహెచ్ఎంసీ కమిషనర్ గా పని చేసిన దళిత ఐఏఎస్ అధికారి దానకిశోర్ ను ప్రభుత్వం కొద్ది నెలలకే అప్రాధాన్య పోస్టుకు బదిలీ చేసింది. ఎన్నికల సమయంలో 'గ్రేటర్ హైదరాబాద్' నగరంలో హోర్డింగ్లు,ఫ్లెక్సీల విషయంలో కటువుగా ఉన్నందుకే ఆయనపై అధికార పార్టీ బిఆర్ఎస్ కక్ష కట్టిందన్న ప్రచారం జరిగింది. గతంలో పాఠశాల విద్యా కమిషనర్ గా పని చేసిన విజయ్ కుమార్ ను ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసింది.ఆరు నెలల పాటు పోస్టింగ్ కూడా ఇవ్వలేదు.

గురుకులాల కార్యదర్శిగా పని చేసిన ఐపీఎస్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్ ను కేసీఆర్ ఎన్నో సందర్భాల్లో ప్రశంసించారు.అయితే అదంతా కేవలం ప్రజలు,మీడియా కోసమేనని ఆ తర్వాతే ప్రవీణ్ కుమార్ కు తెలిసి వచ్చింది. కొత్త గురుకులాల ఏర్పాటు నుంచి విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు వినూత్న కార్యక్రమాలను ప్రవీణ్ చేపట్టారు. గురుకులాల్లో ప్రతి నెల జరిగే మీటింగ్లకు స్థానిక ఎమ్మెల్యే,జడ్పీ చైర్పర్సన్,ఎంపీపీ, మున్సిపల్ చైర్మన్ను ఆహ్వానించాలని కేసీఆర్ కేబినెట్ నిర్ణయించడం ఇందుకు పునాది. అడ్మిషన్లు,గురుకులాల నిర్వహణలో రాజకీయ ఒత్తిళ్లు,రాజకీయనాయకుల జోక్యంతోనే సమర్థుడైన ఐపీఎస్ అధికారి ప్రవీణ్ కుమార్ విఆర్ఎస్ తీసుకొని బహుజనసమాజ్ పార్టీలో చేరారు.ఆ తర్వాత ఆయన కేసీఆర్ పార్టీలో నే చేరడం ఒక విశేషం.

ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళిని అప్రాధాన్య పోస్టుకు బదిలీ చేసిన అసంతృప్తితో ఉద్యోగం వదిలిపెట్టారు.దళిత ఐఏఎస్ లకు అన్యాయం జరుగుతోందని మురళి అప్పట్లో ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో 'ఈజీఎస్' డైరెక్టర్ గా ఉన్న మురళి,తర్వాత భూపాలపల్లి కలెక్టర్ గా పని చేశారు. నిరుపేదల పక్షపాతిగా పేరున్న మురళి సమర్థుడైన అధికారిగానూ పేరు సంపాదించారు. ఆయనను ఏకంగా పురావస్తు శాఖకు బదిలీ చేయడం కక్ష సాధింపులో భాగమని అప్పట్లో వార్తలు వెలువడ్డాయి.తెలంగాణలో వీఆర్ఎస్ తీసుకున్న మురళిని జగన్ ప్రభుత్వం పిలిచి విద్యారంగానికి సంబంధించిన సలహాదారుగా నియమించుకుంది.''ఆకునూరి మురళి ఐదుగురు ముఖ్యమంత్రుల దగ్గర పనిచేశారు.ప్రతిభ ఉన్న వాళ్లకు మంచి అవకాశాలు ఇవ్వడం గత ముఖ్యమంత్రులుచేసే వారు. సీఎం కేసీఆర్ పాలనలో ఉన్నంత వివక్ష,దరిద్రమైన పరిపాలన ఎప్పుడూ చూడలేదు. తెలంగాణలో అగ్రవర్ణాలను అందలం ఎక్కిస్తున్నరు. రిటైర్ అయిన 10 నుంచి 12 ఏండ్లు నాన్ ఐఏఎస్ ఆఫీసర్లకు మాత్రం ఐఏఎస్ కేడర్ పోస్టులు,కీలక పదవులు అప్పజెప్పారు.ఐదుగు వర్గాల ఐఏఎస్‌లకు మాత్రం అప్రాధాన్య పోస్టులు ఇస్తున్నారు. సర్వీస్ ఏండ్లు గడుస్తున్నా చాలా మంది కలెక్టర్‌గా పనిచేయలేదు.ఇది ముమ్మాటికీ ఎస్సీ, ఎస్టీలపై వివక్షే. ఇంత వివక్ష ఎప్పుడు చూడలేదు'' అని మురళి ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు.



**- ఎస్.కే.జకీర్, సీనియర్ జర్నలిస్ట్**

**దళిత సాధికారత,దళిత బంధు కేవలం పేరుకు మాత్రమే.వారికి అత్యధిక ప్రాధాన్యమిస్తున్నట్లు చెబుతూనే కేసీఆర్ తన కార్యాలయంలో ఒక్క దళిత అధికారినీ చేర్చుకోలేదు. రాష్ట్రం ఏర్పడ్డప్పటి నుంచి ఉన్న వాళ్లే సీఎంవోలో కీలకంగా ఉన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో ఆయన ఆఫీసులోని ఐదుగురు ఆఫీసర్లలో ప్రిన్సిపల్ సెక్రటరీ సహా ఇద్దరు సెక్రటరీలు రిటైర్ అయిన వారే కొనసాగారు. . మిగతా ఇద్దరు మాత్రమే సర్వీస్లో ఉన్నవారు. "సీఎంవోలో దళితులున్నారా""?అని ప్రస్తుత లోక్ సభ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రశ్నించటం రాజకీయంగా అప్పట్లో దుమారం లేపింది.**

ప్రస్తుతం రేవంత్ రెడ్డి కేసీఆర్ హయాంలో జరిగిన వివక్షను దృష్టిలో పెట్టుకొని తన కార్యాలయంలో,ఇతర ప్రాధాన్య పోస్టులలో ఎస్.సి,ఎస్.టి,బిసి,మైనారిటీలు,బహుజన అధికారులను నియమిస్తున్నట్టు కనబడుతున్నది.'రెడ్డి పరివార్' అనే నింద రాకుండా చూసుకోవాలని సీఎం రేవంత్ శ్రేయోభిలాషులు కోరుతున్నారు.

**తెలంగాణకు రెండో సీఎస్ గా నియమితులైన ప్రదీప్ చంద్ర కొత్త జిల్లాల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఫైనాన్స్,రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీగా కూడా పని చేసిన ప్రదీప్ చంద్ర 2 నెలలే చీఫ్ సెక్రెటరీగా ఉన్నారు. ఆయనకు ఎక్స్టెన్షన్ ఇవ్వలేదు. కనీసం ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ ఇవ్వకుండా అవమానించారు. ఉత్తరాదికి చెందిన తొలి సీఎస్ రాజీవ్ శర్మకు రెండుసార్లు పదవీకాలం పొడిగించారు. ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా కూడా ఆయనను నియమించుకున్నారు.**

**కేసీఆర్ హయాంలో దళిత ఆఫీసర్లకు అడుగడుగునా అవమానం జరిగినట్టు,ఐఏఎస్, ఐపీఎస్లకు కీలక పోస్టులు ఇవ్వకుండా చిన్నచూపు చూసినట్టు,అప్రాధాన్య పోస్టుల్లోకి పంపుతూ చులకన చేసినట్టు,ఇతర వర్గాల వారికి ఎక్స్టెన్షన్లు,పెద్ద పోస్టులు ఇవ్వడం ఉత్తరాది వాళ్లకే ప్రాధాన్యం ఉన్న పదవులు కట్టబెట్టిన ఉదంతాలన్నీ అదృష్టవశాత్తు కాంగ్రెస్ అధికారంలోకి రావడం వలన,రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినందున వెలుగులోకి వస్తున్నవి. అలా కాకుండా కేసీఆర్ హ్యాట్రిక్ సాధించి ఉంటే బిఆర్ఎస్ నాయకులకు పట్టపగ్గాలు ఉండేవి కాదు.**

**ఫార్ములా కేసులో చాలా కోణాలున్నవి. ఇందులో కనిపించని ప్రధాన కోణం దళిత అధికారుల పట్ల కేసీఆర్ హయాంలో చూపిన వివక్ష,నిర్లక్ష్య ధోరణి. తమ సామాజికవర్గ అధికారులు ఎక్కడెక్కడ పనిచేస్తున్నారో వెతికి,వెతికి గాలించి తీసుకువచ్చి ముఖ్యమైన పోస్టింగులు ఇచ్చి,ఆ పోస్టులలో,వాళ్ళు పనిచేస్తున్న చోటే ఏండ్ల తరబడి ఉండేలా ఉత్తర్వులు జారీ చెశారు. అలాగే పదవీ విరమణ చేసినా ఏండ్ల తరబడి ఆయా పోస్టుల్లోనే గడువు పొడిగిస్తూ పోవడం కేసీఆర్ హయాంలో మాత్రమే జరిగిన వింత.**

## రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో పురోగతి

### టెండర్లు పిలిచిన కేంద్రం.. హైదరాబాద్ ప్రగతికి కీలకమలుపు

రెండేళ్ళలో పూర్తిచేయాలని గడువు.. రూ.5,555 కోట్లతో నిర్మాణం


సంగారెడ్డి, గజ్వేల్, యాదాద్రి ప్రాంతాలకు మహర్దశ




**హైదరాబాద్, మహా:** రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే కాకుండా టెండర్ల ప్రక్రియను ప్రారంభించింది. హైదరాబాద్ నార్త్ పార్ట్ కి టెండర్లను శనివారం కేంద్రం ఆహ్వానించింది. నాలుగు లైన్ల ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం కోసం కేంద్రం టెండర్లు పిలిచింది. సంగారెడ్డి లోని గిమ్మాపూర్ నుంచి యాదాద్రి వరకు మొత్తం నాలుగు భాగాలుగా రోడ్డు నిర్మాణానికి టెండర్స్ కేంద్రం టెండర్లు పిలిచింది. రూ. 5,555 కోట్ల రూపాయల పనులకు కేంద్రం టెండర్లు పిలిచింది. రెండు సంవత్సరాల్లో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని నిబంధన విధించింది. సంగారెడ్డి జిల్లా గిర్మ్ పూర్ గ్రామం నుండి రెడ్డిపల్లి గ్రామం వరకు 34.518 కిలోమీటర్లు, రెడ్డిపల్లి గ్రామం నుండి ఇస్లాంపూర్ గ్రామం వరకు 26 కిలోమీటర్లు, ఇస్లాంపూర్ నుండి ప్రజ్ఞాపూర్ వరకు 23 కిలోమీటర్లు, సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ నుండి యాదాద్రి జిల్లా రాయగిరి వరకు 43 కిలోమీటర్లు, మొత్తం 161.5 కిలోమీటర్ల పొడవు రోడ్డు నిర్మాణానికి కేంద్రం టెండర్లు పిలిచింది.

## భారత్‌పై వాటర్‌బాంబ్!

### ప్రపంచంలోనే అతిపెద్ద డ్యామ్ నిర్మించేందుకు చైనా సన్నాహాలు



బీజింగ్: ప్రపంచంలోనే అతిపెద్ద హైడ్రోపవర్ డ్యామ్‌ను నిర్మించేందుకు చైనా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. టిబెట్ పీఠభూమి తూర్పు అంచున ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టు వల్ల దిగువనున్న భారత్, బంగ్లాదేశ్‌కు చెందిన లక్షలాది మంది ప్రజలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుంది. యార్లంగ్ జాంగ్పో నది దిగువ ప్రాంతాన నిర్మించే ఈ డ్యామ్ ద్వారా ప్రతి ఏడాది 300 బిలియన్ కేడబ్ల్యూహెచ్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తుందని చైనాకు చెందిన పవర్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ అంచనా వేసింది. ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్దదైన సెంట్రల్ చైనాలోని త్రీ గోర్జెస్ ఆనకట్ట ప్రతిఏడాది ఉత్పత్తి చేసే 88.2 బిలియన్ కేడబ్ల్యూహెచ్ కన్నా ఇది మూడు రెట్లు. అయితే ఈ ప్రాజెక్టు కారణంగా ఎంతమంది నిర్వాసితులవుతారు, పర్యావరణ వ్యవస్థకు కలిగే నష్టానికి సంబంధించిన వివరాలను చైనా వెల్లడించ లేదు.

## ఎప్పుడు ఏ స్లోగన్ ఇవ్వాలో మీకు తెలియదు

### అభిమానులపై పవన్ కళ్యాణ్ అసహనం



**మహా, ఆంధ్రప్రదేశ్:** అన్నమయ్య జిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన్ని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించి దాడి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవన్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధ్యులను వదిలిపెట్టమని హెచ్చరించారు ఇదిలాఉండగా, పవన్‌ని చూసేందుకు అక్కడికి వచ్చిన పలువురు అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన సీరియస్‌గా మీడియాతో మాట్లాడుతున్న సమయంలో 'ఓజీ.. ఓజీ.. ఓజీ' అంటూ స్లోగన్లు చేశారు. దీనిపై ఆయన ఆగ్రహానికి గురయ్యారు. ''ఏంటయ్యా మీరు. ఎప్పుడు ఏ స్లోగన్ ఇవ్వాలో మీకు తెలియదు. పక్కకు రండి'' అంటూ తన అసహనాన్ని తెలియజేశారు.

# మచ్చలేని నాయకుడు మన్మోహన్

**భారతదేశ రాజకీయాల్లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రత్యేకం. భారత ఆర్థిక దుస్థితికి చికిత్స చేసిన నిజమైన డాక్టరు ఆయన. కౌటిల్యుని అర్థశాస్త్రానికి తొలి డాక్టరేట్ ఇచ్చిన ఆచార్యుడు ఆయన. అతను ఎక్కడ కూర్చున్న అదే సింహాసనం. మాట్లాడకుంటే మాటలు పడిపోతాయి కానీ మాట్లాడకుండానే ప్రభుత్వాన్ని పదేళ్లు పడిపోకుండా నిలబెట్టిన ఒకే ఒక్కడు.. మగాడు అతడు. మౌనంగా.. మహోన్నతంగా రాజకీయాలు చేసిన దురంధరుడు. హైదరాబాద్ ఓఆర్ ఆర్, హైదరాబాద్ మెట్రో, ఐఐటి హైదరాబాద్ ఇలాంటి ప్రతిష్ఠాత్మక గేమ్ ఛేంజర్లకు బీజం ఆయనే. ఆర్థికసంస్కరణలతో దేశ ఆర్థికరథాన్ని, తెలంగాణ ప్రగతిచిత్రాన్ని మార్చిన మహోన్నతుడు మౌనంగా వెళ్ళిపోయినా ఆయన విజయాలను స్మరించుకుంటోంది తెలంగాణ.**

*- తాజా రాజకీయ పరిణామాలపై.. ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్*



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్


భారతదేశ రాజకీయాల్లో డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రత్యేకం. భారత ఆర్థిక దుస్థితికి చికిత్స చేసిన నిజమైన డాక్టరు ఆయన. కౌటిల్యుని అర్థశాస్త్రానికి తొలి డాక్టరేట్ ఇచ్చిన ఆచార్యుడు ఆయన. అతను ఎక్కడ కూర్చున్న అదే సింహాసనం. మాట్లాడకుంటే మాటలు పడిపోతాయి కానీ మాట్లాడకుండానే ప్రభుత్వాన్ని పదేళ్లు పడిపోకుండా నిలబెట్టిన మూగవాడు కాదు ఒకే ఒక్కడు.. మగాడు అతడు. జగమెరిగిన భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ తెలంగాణ ఇచ్చినవాడు. ప్రధానిగా ఆయన తెలంగాణకు చేసిన అద్భుత మేళ్ళు ఎన్నో. రయ్ రయ్ మంటూ.. నేడు రాజధాని ప్రయాణాన్ని ఎంతో సులభం చేసిన హైదరాబాద్ ఓఆర్ఆర్ ఆయన చలవే. మౌనంగా.. మహోన్నతంగా రాజకీయాలు చేసిన దురంధరుడు. హైదరాబాద్ ఓఆర్ ఆర్, హైదరాబాద్ మెట్రో, ఐఐటి హైదరాబాద్ ఇలాంటి ప్రతిష్టాత్మక గేమ్ ఛేంజర్లకు బీజం ఆయనే. ఆర్థికసంస్కరణలతో దేశ ఆర్థికరథాన్ని, తెలంగాణ ప్రగతిచిత్రాన్ని మార్చిన మహోన్నతుడు మౌనంగా వెళ్ళిపోయినా ఆయన విజయాలను స్మరించుకుంటోంది తెలంగాణ. సంతాపదినాలు ప్రకటించడమే కాకుండా మన్మోహనుడికి నివాళిగా శాసనసభను కూడా సమావేశపరుస్తున్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

**కేటీఆర్ కేసులో ఎసిబి ఎంటరై అరెస్ట్ చేస్తుందనుకుంటే ఈడి ఎంటైరంది. ముఖ్యమంత్రిగా రేవంత్ చాణక్యానికి ఈ వ్యూహం నిదర్శనం. తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేస్తే కక్షపూరితమంటూ నిందలు వేసే ఆస్కారముండగా, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు రంగంలోకి దిగడం బిఆర్ఎస్ కు మింగుడు పడని అంశమే. కవిత కేసులో బెయిల్ రావడానికి ఐదుమాసాలు కాగా, ఈ కేసులో ఐఎఎస్ లు అప్రూవర్ గా మారే అవకాశం ఉండడం, కేటీఆర్ కూడా పలుమార్లు బహిరంగంగా తప్పునాదే అని చెప్పడంతో ఏం జరుగుతుందోనన్న ఆందోళన నెలకొంది. 2024లో సైలెంట్ గా ఉన్న బిజెపి కేటీఆర్ కు డేట్ ఫిక్స్ చేయడం ద్వారా 2025 గేమ్ ప్లాన్ మొదలుపెట్టినట్లు స్పష్టమవుతోంది. కమలం గేమ్ నుండి గులాబీ ఎలా బయటపడుతుందో చూడాలి.**

డాక్టర్ మన్మోహన్ సింగ్ మచ్చలేని నాయకుడు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో ప్రధానిగా మన్మోహన్ సింగ్ పాత్ర కీలకం. దేశాన్ని మలుపుతిప్పిన మౌనముని. అర్థికసంస్కరణలతో దేశ ఆర్థికరథాన్ని మరో మెట్టు ఎక్కించిన దార్శనికుడు. తెలంగాణ ప్రగతిపై మన్మోహన్ సింగ్ బలమైన ముద్రవేశారు. తెలంగాణ ప్రభుత్వం మన్మోహన్ సింగ్ కు నివాళిగా వారంరోజులు సంతాపదినాలు ప్రకటించింది. తెలంగాణకు మన్మోహన్ సింగ్ చేసిన ప్రగతిని గుర్తు చేసుకునేలా ప్రత్యేక శాసనసభ సమావేశం కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏర్పాటుచేశారు.

డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా అందించిన సహకారం వల్లే తెలంగాణ బిల్లు కేబినెట్ ఆమోదించడమైనా, బిల్లు పార్లమెంట్ కు చేరడమైనా. మన్మోహన్ సేవలను గుర్తుచేసుకోవడం తెలంగాణ ప్రజల కర్తవ్యం. తెలంగాణ శాసనసభలో గత పదమూడు మాసాలుగా నోరుమెదపని కేసీఆర్ ప్రతిపక్షనేతగా సభకు వస్తారా.. రారా అన్నది ఆసక్తికరం. ఇలాంటి చర్చ జరగడం కూడా విషాదమే. కేసీఆర్ సభకు వస్తే మన్మోహన్ సింగ్ సేవల గురించి మననం చేసుకోవాలి. అనుబంధం నెమరువేసుకునే అవకాశం ఉంటుంది తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు జరిగిన ప్రక్రియలో ఏర్పడ్డ ఇబ్బందులు.. మన్మోహన్ అందించిన సహకారం, చేసిన సూచనలు ఇలాంటివన్నీ మరోసారి గుర్తుచేసుకోవొచ్చు. ఆ మహనీయుడి సహకారం లేకపోతే, ఆమోదం లేకపోతే తెలంగాణ రాష్ట్రం సిద్ధించేదే కాదు. కేసీఆర్ రాకపోతే ఆ మహనీయుడిని గౌరవించలేదన్న అపప్రద పడుతుంది. మన్మోహన్ సింగ్ కేబినెట్ లో కేసీఆర్ కేంద్రమంత్రిగా కూడా పనిచేశారు. ఆ అనుభవాలను కూడా శాసనసభ వేదికగా పంచుకోవొచ్చు. రాజనీతిజ్ఞుడి సహకారాన్ని తప్పనిసరిగా గుర్తుచేసుకోవాల్సిన పరిస్థితి. ఇతర రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులు వేరు. తెలంగాణలో పరిస్థితి వేరు. గత పదమూడుమాసాల్లో ఎమ్మెల్యేగా తన ప్రమాణస్వీకారానికి, తర్వాత డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం వినడానికి మాత్రమే కేసీఆర్ హాజరయ్యారు. రేవంత్ రాజకీయ ఎత్తుగడలకు చాణక్యానికి ఈ సమావేశ ఏర్పాటు నిదర్శనం. ఈ సమావేశానికి హాజరుకావడం ద్వారా కేసీఆర్ తన రాజకీయ పరిణతిని ప్రదర్శిస్తారా? హాజరుకాకూడదన్న పట్టుదలతో ఉంటారా? అన్నది ఆయన రాజకీయ ఆలోచనలపైన ఆధారపడి ఉంది. కానీ ఈ పరిణామాన్ని మాత్రం తెలంగాణ సమాజం గమనిస్తుంది.

**డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానిగా అందించిన సహకారం వల్లే కేబినెట్ ఆమోదించడమైనా, బిల్లు పార్లమెంట్ కు చేరడమైనా. మన్మోహన్ సేవలను గుర్తుచేసుకోవడం తెలంగాణ ప్రజల కర్తవ్యం. తెలంగాణ శాసనసభలో గత పదమూడు మాసాలుగా నోరుమెదపని కేసీఆర్ ప్రతిపక్షనేతగా సభకు వస్తారా.. రారా అన్నది ఆసక్తికరం. ఇలా చర్చ జరగడమూ ఓ విషాదం.**



మరోవైపు కేటీఆర్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ ఊహించని ట్విస్ట్ లతో షాకిచ్చారు. కేటీఆర్ కేసులో ఎసిబి ఎంటరై అరెస్ట్ చేస్తుందనుకుంటే ఈడి ఎంటైరంది. ఇదే ముఖ్యమంత్రిగా రేవంత్ చాణక్యానికి నిదర్శనం. తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేస్తే కక్షపూరితమంటూ నిందలు వేసే ఆస్కారముండగా, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు రంగంలోకి దిగడం బిఆర్ఎస్ కు మింగుడు పడని అంశమే. కవిత కేసులో బెయిల్ రావడం కష్టం కాగా, ఈ కేసులో ఐఎఎస్ లు అప్రూవర్ గా మారే అవకాశం ఉండడం, కేటీఆర్ కూడా పలుమార్లు బహిరంగంగా తప్పునాదే అని చెప్పడంతో పరిస్థితిపై ఆందోళన నెలకొంది. 2024లో సైలెంట్ గా ఉన్న బిజెపి కేటీఆర్ కు డేట్ ఫిక్స్ చేయడం ద్వారా 2025 గేమ్ ప్లాన్ మొదలుపెట్టినట్లు స్పష్టమవుతోంది. దమ్ముంటే అరెస్ట్ చేస్కో రేవంత్ అంటూ సవాళ్ళమీద సవాళ్ళు విసిరిన కేటీఆర్ ఈడి జనవరి 7న రమ్మని నోటీసిచ్చిన తర్వాత అలా అనడం లేదు. ఇప్పటికే హైకోర్టులో కౌంటర్ దాఖలు చేసి నాకేంటి సబంధం .. నిబంధనలు చట్టాలు అధికారులకు తెలుసు అంటూ యూటర్న్ తీసుకున్నారు. దీనిపై ఐఎఎస్ లు గరంగా ఉన్నారు. అధికారుల తప్పులేదు.. నేనే చెప్పా అంటూ మీడియాసమావేశాలు పెట్టి మరీ వాదించిన కేటీఆర్ కేసు బిగుసుకుంటున్న కొద్దీ నాలుక మడతేస్తున్న సంగతి హైకోర్టులో దాఖలు చేసిన కౌంటర్ అఫిడవిట్ ద్వారా స్పష్టమవుతోంది. ఈడితో అంత ఈజీకాదన్న విషయం, పిఎంఎల్ ఏ చట్టం పవర్ ఇప్పటికే కేసీఆర్ కుటుంబానికి తెలుసు. ఈడి నోటీసులు జారీచేసిన సందర్భంలో కేటీఆర్ ఢిల్లీలోనే ఉన్నారు. జనవరిలోనే అరెస్ట్ చేస్తారా? విచారించి వదిలేస్తారా? కవిత కేసు తరహాలో విచారణల ఎపిసోడ్ వారాల తరబడి సాగుతుందా? అన్న అంశాలపై చర్చలు సాగుతున్నాయి.

గత రెండువారాలుగా తెలంగాణ నుండి నేషనల్ మీడియా దాకా రచ్చరచ్చ అయిన అల్లు అర్జున్ ఎపిసోడ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సినీపెద్దల భేటీ అనంతరం తెరపడింది. సినీపెద్దలందరినీ ఒక వేదికమీదికి తీసుకురావడం ద్వారా సినిమారంగం పై తనకున్న ఆలోచనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. బెనిఫిట్ షోలపై షాకిస్తూనే.. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు కూడా బెనిఫిట్ ఉండాలని తేల్చేశారు. అల్లు అర్జున్ ఎపిసోడ్ లో సామాన్యులవైపు నిలబడ్డ రేవంత్ ఇమేజ్ అనూహ్యంగా పెరిగింది. ఈ వ్యవహారంలో అల్లు అర్జున్ అరెస్ట్ సమయంలో కొంత వ్యతిరేకత వచ్చినట్లు ఓ వర్గం ప్రచారం చేసినా, బిజెపి అనుకూల మీడియా జాతీయస్థాయిలో తలకెత్తుకున్నా.. చివరకు పరిణామాలన్నీ ముఖ్యమంత్రి రేవంతే కరెక్ట్ అన్నట్లుగా ముగిసిపోయాయి. సామాన్యుల ముఖ్యమంత్రిగా, సామాన్యుల హీరోగా అసెంబ్లీవేదికగా ఆవిష్కరించుకోవడంలో ముఖ్యమంత్రి రేవంత్ సక్సెస్ అయ్యారు. ముఖ్యమంత్రిగా బుడిబుడి అడుగులు వేసే దశనుండి పూర్తిస్థాయిలో అధికారపీఠంపై సాధికారిత తెచ్చుకునేలా ఈ ఏడాదిని అన్ని కోణాల్లో సీఎం సద్వినియోగం చేసుకున్నారు. 2024లో అనేక ఛాలెంజ్ లను సునాయాసంగా ఎదుర్కొన్న రేవంత్ ఫీల్ గుడ్ సర్కార్ గా ముద్రవేసుకోవడంలో సక్సెస్ అయ్యారని చెప్పవచ్చు.

## కిడ్నీలు ఫెయిల్ అయిన వారిలో కనిపించే లక్షణాలు ఇవే.. జాగ్రత్త పడండి..!

మన శరీరంలో ఉండే అతి ముఖ్యమైన అవయవాల్లో కిడ్నీలు కూడా ఒకటి. ఇవి నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటాయి. శరీరంలోని వ్యర్థాలను బయటకు పంపుతుంటాయి. రక్తాన్ని శుద్ధి చేస్తాయి. కిడ్నీల వల్ల మన శరీరంలో వ్యర్థాలు, టాక్సిన్లు పేరుకుపోకుండా మనం ఆరోగ్యంగా ఉండగలుగుతాం. అయితే చాలా మందికి ప్రస్తుతం కిడ్నీలు ఫెయిల్ అవుతున్నాయి. అందుకు కారణాలు అనేకం ఉంటున్నాయి. పొగ తాగడం, మద్యం సేవించడం, డయాబెటిస్, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఉప్పును అధికంగా తినడం వంటి కారణాల వల్ల కిడ్నీలు ఫెయిల్ అవుతున్నాయి. అయితే కిడ్నీలు ఫెయిల్ అయితే ప్రారంభంలోనే మన శరరీం మనకు కొన్ని లక్షణాలను తెలియజేస్తుంది. వాటిని గమనిస్తే కిడ్నీలు డ్యామేజ్ అయ్యాయని అర్థం చేసుకోవచ్చు. ఇక కిడ్నీలు డ్యామేజ్ అయితే ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.



**నీరసం, అలసట..**

కిడ్నీలు ఫెయిల్ అయితే కనిపించే మొదటి లక్షణం నీరసం, అలసట. కిడ్నీలు ఫెయిడ్ అయితే శరీరంలోని వ్యర్థాలు సరిగ్గా బయటకు పోవు. దీంతో అవి శరీరంలో పేరుకుపోతాయి. ఫలితంగా శరీర కణాలకు ఆక్సిజన్, గ్లూకోజ్ లభించడం కష్టమవుతుంది. దీంతో మనం ఆహారం తీసుకున్నప్పటికీ నీరసంగా, అలసటగా ఉంటుంది. పనిచేయలేకపోతాం. ఈ లక్షణాలు కనుక మీలో ఉంటే మీ కిడ్నీలు పాడయ్యాయని అర్థం చేసుకోవాలి. వెంటనే అలర్ట్ అయి డాక్టర్‌కు చూపించుకోవాలి. అలాగే కిడ్నీలు ఫెయిల్ అయితే తరచూ మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. రాత్రి పూట మరిన్ని ఎక్కువ సార్లు మూత్ర విసర్జన చేస్తారు. దీంతో నిద్రకు ఆటంకం ఏర్పడి నిద్రలేమి సమస్య వస్తుంది. మీకు కూడా ఇలాగే అవుతుంటే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలవండి.

**చర్మంపై ప్రభావం..**

కిడ్నీలు సరిగ్గా పనిచేయకపోతే శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. దీంతో చర్మంపై కూడా ప్రభావం పడుతుంది. చర్మం దురద పెడుతుంది. కొందరికి దద్దుర్లు కూడా వస్తుంటాయి. అలాగే మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు తరచూ వస్తున్నా కూడా కిడ్నీలు డ్యామేజ్ అయ్యాయని అర్థం చేసుకోవాలి. కొందరికి మూత్రంలో రక్తం కూడా పడుతుంది. ఇలాంటి స్థితి గనక ఉంటే కిడ్నీలు పాడై చాలా రోజులు అయిందని అర్థం. ఇలాంటి లక్షణం కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకూడదు. వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకోవాలి. అదేవిధంగా కిడ్నీలు డ్యామేజ్ అయిన వారికి మూత్రంలో నురుగు వస్తుంటుంది. ఇలా ఉన్నా కూడా అనుమానించాల్సిందే.

**శరీరంలో నీరు..**

కిడ్నీలు పనిచేయకపోతే శరీరంలో వ్యర్థాలు పేరుకుపోయి కళ్ల చుట్టూ వాపులు వస్తాయి. తరచూ ఈ లక్షణం కనిపిస్తుంటే కిడ్నీలు డ్యామేజ్ అయ్యాయేమో చెక్ చేయించుకోవాలి. అదేవిధంగా కిడ్నీలు పాడైన వారిలో శరీరంలో నీరు చేరుతుంది. దీంతో పాదాలు, ముఖ్యంగా మడమల వద్ద వాపులు కనిపిస్తాయి. ఆ ప్రాంతంలో వేలితో నొక్కితే సొట్టపడి చర్మం లోపలికిపోతుంది. ఇలా అవుతున్నా కూడా కిడ్నీలు డేంజర్‌లో ఉన్నాయని అర్థం చేసుకోవాలి. వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. ముందుగానే జాగ్రత్త పడితే కిడ్నీ వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. దీంతో ప్రాణాంతకం కాకుండా ముందే ఆపవచ్చు.



## పొదుపు సంప్రదాయం

భారత్‌లో పొదుపు సంప్రదాయం ఎన్నో ఏళ్ల నుంచో వస్తోంది. విశేషమేమిటంటే.. నేటికీ దేశ పొదుపు రేటు ప్రపంచ సగటు కన్నా ఎక్కువగానే ఉంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) ఎకోర్రాప్ నివేదిక ప్రకారం.. భారత పొదుపు రేటు 30.2 శాతం, ప్రపంచ సగటు 28.2 శాతం కన్నా ఎక్కువే. అయితే, డబ్బు పొదుపులో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉంది. భారత్ కన్నా ముందు పొరుగుదేశమైన చైనా (46.6శాతం)తో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాత ఇండోనేషియా (38.1శాతం), రష్యా (31.7శాతం) ఉన్నాయి. ఎస్బీఐ నివేదిక హౌస్ సేవింగ్స్ విషయంలో మారుతున్న పరిస్థితులను హైలైట్ చేస్తుంది. పెరుగుతున్న ఆర్థిక చేరిక స్థాయిలతో 80 శాతం కన్నా ఎక్కువ మంది ఇప్పుడు అధికారిక ఫైనాన్షియల్ అకౌంట్లను ఉపయోగిస్తున్నారు. 2011లో ఈ సంఖ్య 50 శాతం మాత్రమే ఉంది. నివేదిక ప్రకారం.. బ్యాంక్ డిపాజిట్లు, క్యాష్ వంటి సాంప్రదాయ సేవింగ్స్ ఆప్షన్ల వాటా ఇప్పుడు భారత్‌లో క్రమంగా తగ్గుతోంది. మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీల వంటి కొత్త ఇన్వెస్ట్‌మెంట్ టూల్స్ హౌస్ సేవింగ్స్ కోసం ప్రాధాన్యత ఎంపికగా మారుతున్నాయి. 2018 ఆర్థిక సంవత్సరం నుంచి మ్యూచువల్ ఫండ్లలో సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (SIP) రిజిస్ట్రేషన్లు 4 రెట్లు పెరిగి 4.8 కోట్లకు చేరుకున్నాయి.

భారతీయులు ఇప్పుడు 'షేర్లు, డిబెంచర్ల'లో కూడా ఎక్కువ డబ్బు పెట్టుబడి పెడుతున్నారు. పదేళ్ల క్రితం అంటే.. 2014 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో షేర్లు, డిబెంచర్ల వాటా 0.2 శాతంగా ఉంది. ఆర్థిక సంవత్సరం 2024లో ఒక శాతానికి పెరిగింది. గత కొన్ని సంవత్సరాల్లో నికర ఆర్థిక పొదుపు వాటా పెరిగింది. 2014 ఆర్థిక సంవత్సరంలో 36 శాతం కాగా, 2021 ఆర్థిక సంవత్సరంలో 52 శాతానికి చేరుకుంది. అయితే, ఆర్థిక సంవత్సరం 2022, ఆర్థిక సంవత్సరం 2023లో స్వల్ప క్షీణత కనిపించింది. మార్కెట్ క్యాపిటలైజేషన్ (ఎంసీపీ)లో ఒక శాతం పెరుగుదల జీడీపీ వృద్ధి రేటును 0.6 శాతం పెంచుతుందని ఎస్‌బీఐ నివేదిక పేర్కొంది. గత 10 ఏళ్లలో భారతీయ కంపెనీలు క్యాపిటల్ మార్కెట్ నుంచి సేకరించిన డబ్బు మొత్తం 10 రెట్లు పెరిగింది. 2014 ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ.12,068 కోట్లు కాగా, అక్టోబర్ 2025 నాటికి రూ.1.21 లక్షల కోట్లకు పెరిగింది.


## చలికాలంలో ఇమ్యూనిటీ పెంచే దివ్యౌషధం

**మహా:** తులసి ఆకులను ప్రత్యేక ఔషధాల నిలయంగా చెబుతారు. వాటితో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. చాలామంది ఇళ్లల్లో, దేవాలయాల్లో తులసీ మొక్కలు ప్రత్యేకంగా దర్శనమిస్తుంటాయి. వాటికి పూజా కార్యక్రమాన్ని సైతం చేసి, తులసి చెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. తులసి ప్రయోజనాలకు సంబంధించి పలువురు తెలిపిన వివరాల ప్రకారం... 'తులసితో బోలెడు ఉపయోగాలున్నాయి. తులసిలో అలర్జీ లక్షణాలను తగ్గించడంలో ఎంతగానో సహాయపడుతాయి. అంతేకాదు.. తులసిలో ఉండే యూజీనాల్ అనే సమ్మేళనం మానసిక స్థితిని మెరుగుపరచడంలో కీలకంగా పనిచేస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ ఇది అద్భుతంగా పనిచేస్తుంది. దగ్గు, జలుబు వంటి పలు సమస్యలను పరిష్కరిస్తుంది. తులసిలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉండడంతో అవి ఇన్ఫెక్షన్లతో పోరాడుతాయి. దీంతో జలుబు, దగ్గు వంటి సమస్యలు మాటుమాయమవుతాయి. వీటితోపాటు డయాబెటిస్ సమస్యలతో బాధపడుతున్నవారికి కూడా ఇది ఔషధంగా ఉపయోగపడుతుంది. ఆస్తమాతో బాధపడుతున్నవాళ్లకు కూడా ఇది హెల్ప్ చేస్తుంది. అదేవిధంగా గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి సమస్యలను సైతం పారద్రోలడంలో తులసి కీలకంగా పనిచేస్తుంది' అని చెబుతున్నారు.



**రచనలకు ఆహ్వానం**
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

# రిసెప్షన్ వేడుకకు హాజరైన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్, మహా:** జిల్లాలో శుభకార్యాలు ఊపందుకోవడంతో ఎక్కడా చూసినా సందడి వాతావరణం కనిపిస్తోంది. అభిమానంతో ఆహ్వానించినవారి శుభకార్యాలకు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్నారు. అందులో భాగంగానే శుక్రవారం రాత్రి చిల్కూరి లక్ష్మీ గార్డెన్‌లో జరిగిన సీనియర్ ఉర్దూ జర్నలిస్ట్ షాహిద్ తవక్కల్ కుమారుడి రిసెప్షన్ వేడుకకు హాజరయ్యారు. నూతన వరుడికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. కంది శ్రీనన్న పెండ్లి కానుకను బహుకరించి దీవెనలు అందించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనతో ఫొటోలు దిగేందుకు ఉత్సాహం కనబర్చారు. కంది శ్రీనివాస రెడ్డి వెంట మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కౌన్సిలర్ షేక్ ఇమ్రాన్, నాయకులు ఎంఏ షకీల్, దేరా కృష్ణ రెడ్డి, బత్తుల శ్రీనివాస్, మొహమ్మద్ రఫీక్, సయ్యద్ షౌకత్ అలీ, అతిక్ ఉర్ రహమాన్, అంజద్ ఖాన్, ఎల్మ రామ్ రెడ్డి, చింటూ, నరేష్ రెడ్డి తదితరులున్నారు.



# ట్రాన్స్ జెండర్ల సమస్యలు హక్కులపై అవగాహన సదస్సు




**రంగారెడ్డి, డిసెంబర్ 28, మహా:** ఆడ, మగ అనేవి భౌతిక పరమైన అంశాలు కావని, జెండర్ అనేది మనసుకు సంబంధించినదని జిల్లా ప్రధాన న్యాయ మూర్తి శశిధర్ రెడ్డి అన్నారు. ట్రాన్స్ జెండర్ల సమస్యలు హక్కులు అనే అంశంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ లోని రంగారెడ్డి జిల్లా కోర్టులో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష ఇప్పటివరకూ మహిళలపైనే కొనసాగిందని అన్నారు. ఇప్పుడూ ట్రాన్స్ జెండర్లు కూడా ఈ జాబితాలో చేరిపోయారన్నారు. వివక్షను చట్టాలెప్పుడూ సమర్థించవన్నారు. ట్రాన్స్ జెండర్ల హక్కుల పరిరక్షణకు ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ యాక్టు ఏర్పాటయిందన్నారు. అనంతరం మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామారావు ట్రాన్స్ జెండర్ ప్రొటెక్షన్ యాక్టు గురించి వివరించారు. అనంతరం క్యూ టీ సెంటర్ నిర్వాహకులు ఆదిత్య మాట్లాడుతూ జెండర్ అనేది క్రోమోజోములు, హార్మోనల్ ఇంబాల్యన్స్ కి కూడా సంబంధించినది కాదన్నారు. రచన, వైజయంతి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లకు కర్ణాటకలో మాదిరిగా రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ప్రత్యేక హౌసింగ్ కాలనీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పొన్న శ్రీదేవి, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, కార్యదర్శి, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.



# పత్తి రైతుల ఆందోళన

**మంచిర్యాల, మహా:** సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకుదిగారు. శనివారం మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం ఎల్లక్కపేట గ్రామంలోని ఆది శంకరాచార్య పత్తి కొనుగోలు కేంద్రం వద్ద అధికారుల తీరును నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. తమ పత్తి పంటను ప్రయివేటు వాళ్లకు విక్రయించుకోవాలని సీసీఐ అధికారులు చెబుతున్నారని ఆరోపించారు. వరుస సెలవులని చెప్పి నాలుగు రోజులుగా పత్తిని కొనుగోలు చేయడంలేదని, దీంతో కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే సీసీఐ నిర్వాహకులు పత్తిని కొనుగోలు చేయడంలేదన్నారు. ప్రయివేటు వాళ్లకు పత్తిని విక్రయిస్తే రేటు తక్కువ వస్తోందని, సీసీఐకి విక్రయిస్తే మద్దతు ధర వస్తుందని పేర్కొంటున్నారు. సీసీఐ అధకారులు స్పందించి తమ పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# లక్ష్మీపూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ పర్యటన

## వినతి పత్రమిచ్చిన గ్రామస్తులు



**ఆదిలాబాద్, మహా:** జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు గ్రామస్తులు గ్రామానికి సంబంధించిన పలు సమస్యలపై వినతి పత్రమిచ్చారు. ప్రధానంగా జైనథ్ ఎక్స్ రోడ్ నుండి లక్ష్మీపూర్ జామిని వరకు రహదారి సౌకర్యంతోపాటు గ్రామంలో బీటీ రోడ్లు, మురికి కాలువల నిర్మాణం చేపట్టాలని వినతి పత్రంలో విన్నవించారు. గత పాలకులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని కనీసం కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామంలో గత దశాబ్ద కాలంగా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. 108 సేవలు కూడా అందడంలేదని, రోడ్డు దెబ్బతినడంతో జైనథ్ ఎక్స్ రోడ్ వరకు పేషంట్ ను తీసుకురమ్మని అంబులెన్స్ వారు చెబుతున్నారని, దీంతో గ్రామస్తులంతా చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గతంలో రోజుకు ఆరు ట్రిప్పులు వచ్చే ఆర్టీసీ బస్సులు కూడా గత నాలుగు సంవత్సరాలుగా కేవలం మూడు ట్రిప్పులు మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. అనంతరం కలెక్టర్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ భగత్, కాట్ పెల్లి మహిపాల్ రెడ్డి, యెల్టి అశోక్ రెడ్డి, సామ లింగన్న, గడ్డం నారాయణ రెడ్డి, దాసరి నారాయణ, పోతారెడ్డి, గజానన్, పి వసంత్ రావు, చంద్రన్న, లింగారెడ్డి, భీంరావు, భూమారెడ్డి, గుణవంత్ రావు, ధర్మాజీ, కైలాష్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హరిహర క్షేత్రంలో ఘనంగా మండల పూజ



**నిర్మల్, మహా:** జిల్లా కేంద్రంలోని హరిహర క్షేత్రం మల్లన్న గుట్ట అయ్యప్ప ఆలయంలో 28వ మండల పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమల ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ నంబూద్రి ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోద మురళీధర్ రెడ్డిలు గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు చేపట్టి వివిధ రకాల పూలతో అలంకరించారు. అరటి మట్టలతో తయారు చేసిన మండపంలో స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దివ్య పదునెట్టాంబడి వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ గురుస్వామి నవయుగ మూర్తి, కోశాధికారి సామ వేణుగోపాల్ రెడ్డి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో వింత రూల్స్..



**ఎల్బీనగర్, డిసెంబర్ 28, మహా:** విజయవాడ జాతీయ రహదారిపై నో ఎంట్రీ సమయంలో హెవీ వెహికల్స్ అడ్డగోలు పార్కింగ్ లతో జనం అవస్థలు పడుతున్నారు. అసలే రోడ్డు విస్తరణ పనులతో ఎదురయ్యే సమస్యలు ఉండగా నో ఎంట్రీ సమయంలో అప్పటికే సిటీలోకి ఎంటరై రోడ్లపక్కన పార్కింగ్ చేసి ఉన్న లారీలపై ట్రాఫిక్ పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదు. దీంతో అటుగా వెళ్లే వాహణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడ్డగోలు పార్కింగ్ లతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు మాత్రం ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు. కాలనీ రోడ్లలో ఇంటి ముందు పార్క్ చేసుకున్న చిన్నచిన్న వాహనాలకు ఫైన్ లు వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు నో ఎంట్రీ సమయంలో సిటీలోకి వచ్చి ట్రాఫిక్ కు, వాహనాదారులకు ఇబ్బందిగా మారుతున్నా హెవీ వెహికల్స్ పై చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. కాలనీలో చాలానాలు వేస్తున్న ట్రాఫిక్ పోలీసులు చట్టప్రకారం హెవీ వెహికల్స్ ఎంట్రీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.. అందులో ఉన్న మర్మం ఏమిటీ అని ప్రశ్నిస్తున్నారు.

# క్రీడాకారులకు టీషర్ట్స్ అందజేత



**ఆదిలాబాద్, మహా:** సీఎం కప్ 2024లో భాగంగా 2వ విడత జిల్లా లెవెల్ లో విజేతలైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా తన క్యాంప్ కార్యాలయంలో టీ షర్ట్ లను అందజేసి బెస్ట్ ఆఫ్ లక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న సీఎం కప్ 2024లో గ్రామ, మండల, జిల్లా లెవెల్ క్రీడా పోటీలలో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనేందుకు ఈ నెల 26న మొదటి బ్యాచ్ హైదారాబాద్, మహబూబ్ నగర్, మెదక్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, హన్మకొండ జిల్లాలకు 276 మంది క్రీడాకారులను పంపించామని, 2వ విడత విజేతలైన క్రీడాకారులను ఈనెల 29, 30వ తేదీలలో ఆర్టీసీ బస్ లలో పంపిస్తామని తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో గెలుపొంది విజేతలుగా నిలిచి, క్రమశిక్షణతో మెలిగి జిల్లాకు మంచి పేరుతోపాటు బహుమతులు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ ఓ వెంకటేశ్వర్లు, ట్రైబల్ ఆఫీసర్ పార్థసారథి, వ్యాయామ ఉపాధ్యాయులు దయానంద రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధానికి సంతాపం ప్రకటించిన మార్కెట్ కమిటీ చైర్మన్




**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 28, మహా:** మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల మార్కెట్ కమిటీ పాలకవర్గం రెండవ రోజు సంతాపం దినంగా పాటించింది. ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వారు మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతదేశ పురోగతిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఎన్నో ఆర్థిక సంస్కరణలు, ప్రజలకు ఉపాధి హామీ పనులు, విద్యా సంస్కరణలు ఇలాంటి అద్భుతమైన ఆలోచనలతో దేశాని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మార్కెట్ కమిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్ ను సందర్శించి రైతులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్, కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జమిలి ఎన్నికలు దేశానికే ప్రమాదకరం

## అమిత్‌షా, అదానీలు మోదీ చీకటి మిత్రులు..నవ భారత రూపశిల్పి డా బీఆర్ అంబేద్కర్ ( తమ్మినేని వీరభద్రం )




**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 28, మహా:** రంగారెడ్డి జిల్లా 10వ మహాసభల సందర్భంగా ఇబ్రహీంపట్నం కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరయ్యారు. దేశ ప్రజలు సమానత్వం కోరుతూ రాజ్యాంగాన్ని రూపొందించిన నవ భారత రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను పార్లమెంట్ సాక్షిగా అవమానించిన దేశ హోంమంత్రి అమిత్‌షాను చట్ట సభల నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి తొలగించడమే కాదు, అతనిపై చర్యలు తీసుకోవాలన్నారు. అంబేద్కర్ ఒక కులానికో.. మతానికో సంబంధించిన వ్యక్తి కాదు.. దేశ ప్రజలందరూ సమానత్వంతో సామాన హక్కులు కలిగి ఉండాలని అందరినీ ఉద్దేశించి రాజ్యాంగం రచించిన గొప్ప వ్యక్తి అని గుర్తుచేశారు. జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలకు మనుగడ లేకుండా పోతుందన్నారు. రాష్ట్రాల హక్కులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెత్తనం చెయాలించాలని చూస్తుందన్నారు. జమిలి ఎన్నికల విధానం అమలు అయితే రాష్ట్రాలు ప్రమాదంలో చిక్కుకుంటాయన్నారు. అంతకుముందు ఆర్టీసీ డిపో నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సీపీఐ(ఎం) శ్రేణులు భారీ ర్యాలీని చేపట్టారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు సీపీఐ(ఎం) రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పగడాల యాదయ్య అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, మధుసూదన్ రెడ్డి, జగదీష్, శోభన్, రాజు, చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు రాంచందర్, సిహెచ్ జంగయ్య, కే జగన్, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రీనివాస్ రెడ్డి, శ్యాంసుందర్, మల్లేష్, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్ మెట్టు మండలాల కార్యదర్శులు బుగ్గరాములు, జంగయ్య, ఎర్పుల నర్సింహ, ఇబ్రహీంపట్నం, యంజాల్ మున్సిపల్ పార్టీ కార్యదర్శులు ఎల్లేష్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# విశ్వశాంతి యాగానికి రూ.లక్ష విరాళమిచ్చిన కంది శ్రీనివాసరెడ్డి

**ఆదిలాబాద్ మహా :** గత ఐదు రోజులుగా ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాల మైదానంలో జరుగుతున్న విశ్వశాంతి మహాయాగాన్ని అదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి సందర్శించారు. యాగం నిర్వహిస్తున్న స్వామీజీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి ని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం కార్యక్రమంలో అన్నదానం నిర్వహణ కోసం తనవంతుగా కంది శ్రీనివాసరెడ్డి ఒక లక్ష రూపాయల విరాళాన్ని అందించారు .మిగతా రోజుల్లో జరిగే కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఆయన నిర్వాహకులకు తెలియజేశారు. అనంతరం యాగశాలలను దర్శించుకుని పూజలు చేసారు. ఆయన వెంట నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి,కౌన్సిలర్లు సంద నర్సింగ్,బండారి సతీష్, యెల్మెల్వార్ రామ్ కుమార్,తుమ్మల వెంకట్ రెడ్డి,ఐ.ఎన్.టి.యూ.సి జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్,పద్మశాలి సంఘం తాలూకా అధ్యక్షులు బొమ్మకంటి రమేష్,పట్టణ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బూర్ల శంకరయ్య,కార్యదర్శి దాసరి ఆశన్న,నాయకులు ఎల్మ రామ్ రెడ్డి,దేరా కృష్ణ రెడ్డి,చిలుకూరి సతీష్,అఖిల్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి,కేతిరెడ్డి సురేందర్ రెడ్డి,రమేష్,లోకారి పోశెట్టి,రాకేష్,చంటి,మహిళా నాయకురాలు శ్రీలేఖ ఆదివాసీ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ఓటర్లను సైతం చైతన్యం చేస్తాం




**ఎల్బీనగర్, డిసెంబర్ 28, మహా:** సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ నూతన సంవత్సరంలో రాష్ట్రంలో, దేశంలో విస్తృతంగా కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డా. బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్, సెక్రటరీ జనరల్ విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. పి. ధర్మరాజు తెలిపారు. శనివారం హయత్ నగర్ లోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో రెండు రోజుల్లో కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నందున గతంలోని అనుభవాలను గుర్తుచేస్తూ భవిష్యత్తు కార్యాచరణలో పలు అంశాలను వివరించారు. సమాచార హక్కు పరిరక్షణ సమితి ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ స్థాయిలో 2024లో తన కార్యకలాపాలను విస్తరించిన సందర్భంగా సమాచార హక్కు చట్టంపై జాతీయస్థాయిలో ప్రజల్లో అవగాహన కలిగించేందుకు, కార్యక్రమాలను అన్ని రాష్ట్రాలలో సదస్సులు, ర్యాలీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఓటు హక్కు.. ప్రతి ఒక్కరూ వినియోగించుకునే విధంగా చేయడానికి ఎన్నో అవగాహన సదస్సులు, ర్యాలీలు, చర్చలు నిర్వహించామన్నారు. ఎన్నికలలో అక్రమాలను నిరోధించడానికి సివిజిల్ యాప్ వినియోగం పెంచడం, పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం, రాష్ట్ర, దేశ ఎన్నికలలో ఓటింగ్ శాతం పెరిగేందుకు జరిపిన కృషిని తెలంగాణ రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గుర్తించి అభినందించడంతో తమలో ఉత్సాహాన్ని మరింత పెంచిందన్నారు. సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా జాతీయ ఉత్తమ సమాచార కార్యకర్త అవార్డు అందుకోవడం మరింత బాధ్యతను పెంచిందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గుర్తించి ఉభయ రాష్ట్రాల పుడమి రత్న అవార్డు అందజేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. ఇదే ఉత్సాహంతో నూతన సంవత్సరంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ ఓటర్లను చైతన్యం చేసి, సరైన నిర్ణయం తీసుకునే విధంగా ప్రణాళికా రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా సమాచార హక్కు పరిరక్షణ సమితి కోఆర్డినేటర్ గా కల్వలా హరికృష్ణ ముదిరాజ్ ను నియమిస్తూ ఉత్తర్వులు అందచేశారు. ఈ కార్యక్రమంలో హయత్ నగగర్ ఎంపీఓ మధుసూదనచారి, హాయత్ నగర్ ఎస్సై సైదులు,పెద్ద అంబర్ పేట్ మిన్సిపల్ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ స్వగృహ స్థలాన్ని కాపాడండి



నాగోల్ బండ్లగూడలో స్థానికుల ఆందోళన

ఎల్బీనగర్, డిసెంబర్ 28, మహా: రాజీవ్ స్వగృహ స్థలాన్ని కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు హద్దులు చెరిపి కబ్జా చేస్తున్నారని నాగోల్ బండ్లగూడలోని రాజీవ్ స్వగృహ నివాసితులు శనివారం ఆదోళనకు దిగారు. రాజీస్ స్వగృహా ఉన్నతాధికారులు స్పందించి ఆ స్థలాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. వెంటనే అక్కడ సర్వే చేసి బౌండరీస్ ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ స్వగృహ ఫోర్త్ బ్లాక్ కోసం కేటాయించిన స్థలాన్ని కొంతమంది బౌండరీస్ తొలగించి కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని రాజీవ్ స్వగృహ కింది స్థాయి అధికారులను ప్రశ్నిస్తే నిర్లక్షంగా సమాధానం చెబుతున్నారని, దీనిపై ఉన్నతాదికారులు అయిన స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్కడ జరుగుతున్న పనులను స్వగృహ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అనిల్ తో నిలిపివేయించారు. అనంతరం రాజీవ్ స్వగృహ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అనిల్ మాట్లాడుతూ కబ్జాకు గురైనట్లు వస్తున్న ఆరోపణలపై రెవెన్యూ వారికి సర్వే కోసం కోరుతామని తెలిపారు. ఈ ఆందోళనలో రాజీవ్ సహాభావన టౌన్షిప్ బ్లాకులకు చెందిన కమిటీ సభ్యులు శ్రీనివాస్ రావు, నరేష్, చెరుకూరి శ్రీనివాస్, నల్ల మునింధర్, సూరెపల్లి గోపి, నల్ల సాయికుమార్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | దేశం-విదేశం | NATIONAL-INTERNATIONAL | ఆదివారం, హైదరాబాద్ | 29-12-2024

## ఈ సమయంలో రాజకీయాలొద్దు: మాయావతి



**యూపీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు, స్మారకంపై రాజకీయాలు చేయడాన్ని బీఎస్పీ చీఫ్ మాయావతి తీవ్రంగా ఖండించారు. మన్మోహన్ సింగ్ కుటుంబం, సిక్కు మతం యొక్క సెంటిమెంట్స్‌ను కేంద్ర సర్కారు గౌరవించాలని హితవుపలికారు. మన్మోహన్ సింగ్ కుటుంబం ఎక్కడైతే ఆయన స్మారకాన్ని నిర్మించాలని కోరుతున్నదో అక్కడే నిర్మించాలని ఆమె సూచించారు. ఈ విషయంలో ఎవరికీ రాజకీయాలు చేసే హక్కు లేదని, కేంద్ర ప్రభుత్వం మన్మోహన్ సింగ్ కుటుంబం కోరిన చోటనే ఆయన స్మారకాన్ని నిర్మించాలని మాయావతి డిమాండ్ చేశారు. మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు జరిగిన చోటనే ఆయన స్మారకాన్ని నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుండగా.. అక్కడ కుదరదని ఆయన స్మారకాన్ని ఎక్కడ నిర్మించాలనేది త్వరలో నిర్ణయిస్తామని కేంద్రం చెబుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మాయావతి తాజా వ్యాఖ్యలు చేశారు.

## జమ్మూ కాశ్మీర్‌ను కప్పేసిన మంచు

### భారీగా పెరిగిన పర్యాటకుల సంఖ్య

### సోషల్ మీడియాలో వైరలవుతున్న వీడియోలు..ఫిదా అవుతున్న నెటిజన్స్



**జమ్మూ:** జమ్మూ కాశ్మీర్‌లో భారీగా మంచు వర్షం కురుస్తోంది. శ్రీనగర్, పుల్వామా, దోడా, అనంత్‌నాగ్, బారాముల్లా, బందిపోర, సోనమార్గ్, పూంచ్, రాజౌరి సహా అనేక ప్రాంతాల్లో విపరీతంగా మంచు పడుతూనే ఉంది. దీంతో ఆ ప్రాంతాల్లో ఎక్కడ చూసిన మంచు పేరుకుపోయి కనిపిస్తుంది. మరోవైపు భారీగా మంచు పడుతుండటంతో శ్రీనగర్ సహా ప్రధాన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి చేరాయి. ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. దీంతో చలి తీవ్రతకు కశ్మీర్ ప్రజలు గజగజ వణికిపోతున్నా. చలిమంటలు వేసుకొని ఉపశమనం పొందుతున్నారు. ప్రముఖ దాల్ సరస్సు సహా పలు నదులు గట్టకట్టుకుపోయాయి. ఎత్తైన ప్రాంతాల్లో నిరంతరంగా మంచు కురుస్తోంది. దీంతో రహదారులు, ఇళ్లు, భవనాలు, చెట్లు, వాహనాలు, ఎత్తైన కొండలపై పడుతున్న మంచు దృశ్యాలు ఆకట్టుకుంటున్నాయి. చిన్నారులు, స్థానిక ప్రజలు, సందర్శకులు మంచు వర్షాన్ని ఆస్వాదిస్తున్నారు. మంచు గడ్డలతో ఆటలు ఆడుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింటా వైరల్ అవుతున్నాయి. ఆ వీడియోలు నెటిజన్స్ ను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అయితే, సాధారణంగా శీతాకాలంలో జమ్మూకాశ్మీర్‌కు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. మంచు తెరల మాటు నుంచి కశ్మీర్ లోయలు, కొండల అందాలను వీక్షించేందుకు దేశ నలుమూలల నుంచేగాక, విదేశాల నుంచి కూడా పర్యాటకులు భారీగా తరలివస్తారు.

## రెండో ఏడాదీ

### 10 లక్షలకు పైగా వీసాలు జారీ

- భారతీయులకు అమెరికా వీసాలు
- వివరాలు వెల్లడించిన అమెరికన్ ఎంబసీ




**ఢిల్లీ:** వరుసగా రెండో సంవత్సరం విజిటర్ వీసాలతో సహా 10 లక్షలకు పైగా నాన్ ఇమిగ్రంట్ వీసాలను అమెరికా భారత్‌కు జారీ చేసింది. 2008/2009 విద్యా సంవత్సరం తర్వాత 2024లో అత్యధిక అంతర్జాతీయ విద్యార్థులను అమెరికాకు పంపించిన ఘనత భారత్ దక్కించుకున్నట్టు భారత్‌లోని అమెరికన్ ఎంబసీ ప్రకటించింది. వరుసగా రెండేళ్లు అత్యధిక సంఖ్యలో అంతర్జాతీయ గ్రాడ్యుయేట్ విద్యార్థులను అమెరికాకు పంపిన దేశాలలో భారత్ ప్రథమ స్థానంలో నిలిచిందని అమెరికన్ మిషన్ ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. గడచిన నాలుగేళ్లుగా అమెరికాకు అత్యధికంగా భారతీయులు ప్రయాణిస్తున్నారని వివరించింది. ఈ ఏడాది అమెరికాలో ఉంటూనే హెచ్ 1బీ వీసా రెన్యువల్ చేసుకునేందుకు ఒక పైలట్ కార్యక్రమాన్ని విజయవంతంగా తమ విదేశాంగ శాఖ అమలు చేసిందని ఎంబసీ తెలిపింది. దీని వల్ల దేశాన్ని వీడకుండానే తమ వీసాలను రెన్యువల్ చేసుకునే అవకాశం భారతీయ ప్రత్యేక వృత్తి నిపుణులకు లభిస్తుందని వివరించింది.

## ఆ రైతులపై సుప్రీంకోర్టు సీరియస్


- దలేవాల్‌ను ఆస్పత్రిలో చేర్చాలని ఆదేశం
- నిరాహారదీక్ష చేస్తున్న రైతు నేత



**ఢిల్లీ:** పంజాబ్‌లో రైతు సమస్యల పరిష్కారం కోసం డిమాండ్ చేస్తూ గత నెల 26 నుంచి నిరాహారదీక్ష చేస్తున్న రైతు నేత జగ్జీత్ సింగ్ దలేవాల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. ఆయనను ఆస్పత్రికి తరలించకుండా ఇతర రైతు నాయకులు అడ్డుకుంటున్నారు. తమ డిమాండ్ల పరిష్కారంపై హామీ ఇచ్చిన తరువాతనే దలేవాల్‌ను ఆసుపత్రికి తరలించేందుకు అంగీకరిస్తామని పట్టుబడుతున్నారు. ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో రైతు నేత దలేవాల్‌ను వెంటనే ఆస్పత్రిలో చేరేందుకు ఒప్పించి, ఆస్పత్రికి తరలించాలని ఈ నెల 20న పంజాబ్ చీఫ్ సెక్రెటరీ, డీజీపీలను సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను అమలు చేయడంలో వారు విఫలం కావడంతో వారికి వ్యతిరేకంగా కోర్టులో కంటెంప్ట్ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం శనివారం విచారణ చేపట్టింది. దలేవాల్‌ను ఆస్పత్రికి తరలించకుండా ఇతర రైతు నేతలు అడ్డుకుంటున్నారని ప్రభుత్వం తరపు న్యాయవాదులు న్యాయస్థానానికి తెలిపారు. దీంతో కోర్టు ఆ రైతు నేతలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దలేవాల్ క్షేమం కోరేవారు ఆవిధంగా ప్రవర్తించరని వ్యాఖ్యానించింది. రైతు నేతలతో మాట్లాడి వెంటనే దలేవాల్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని ఆదేశించింది.

## పార్కర్ సోలార్ ప్రోబ్ సురక్షితం

### సూర్యుడిపై అధ్యయనం కోసం ప్రయోగం వివరాలు వెల్లడించిన నాసా



**న్యూయార్క్:** సూర్యుడి సమీపానికి వెళ్లిన పార్కర్ సోలార్ ప్రోబ్ సురక్షితంగా ఉన్నట్టు నాసా తాజాగా ఓ ప్రకటన చేసింది. సూర్యుడికి 60 లక్షల కిలోమీటర్ల సమీపానికి చేరుకున్న ఈ వ్యోమనౌక నుంచి కొన్నిరోజులుగా నాసాకు సమాచారం తెగిపోయింది. అత్యంత వేడి వాతావరణానికి సమీపానికి వెళ్లిన నేపథ్యంలో ఈ వ్యోమనౌక ఆచూకీ విషయమై ఆందోళన వ్యక్తమైంది. అయితే, గురువారం అర్ధరాత్రి దీని నుంచి నాసాకు మళ్లీ సిగ్నల్ అందింది. దీంతో వ్యోమనౌక సురక్షితంగా ఉన్నట్టు నాసా ప్రకటన చేసింది. ముందుగా నిర్దేశించిన మేర సూర్యుడి సమీపానికి ఇది చేరుకున్నదని, ఇక ఇదే దూరంతో సూర్యుడి చుట్టూ సంచరించనున్నట్టు వెల్లడించింది. కాగా, సూర్యుడిపై అధ్యయనం కోసం 2018లో పార్కర్ సోలార్ ప్రోబ్‌ను నాసా ప్రయోగించింది. ఇప్పటివరకు తయారుచేసిన వేగవంతమైన వ్యోమనౌకల్లో ఇది మొదటిది. ఇది గంటకు 6. 90 లక్షల కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. సూర్యుడి దగ్గర ఉండే అసాధారణ ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు వీలుగా దీనికి ఒక రక్షణ కవచాన్ని కూడా ఏర్పాటు చేశారు.

## నూతన ఏడాది నుంచి ఇండియన్ రైల్వే కొత్త టైమ్ టేబుల్..!

- పాత నిబంధనలకు సవరణలు
- మరిన్ని రైళ్లను ప్రారంభించే యోచన




**ఢిల్లీ:** వచ్చే నెల నుంచి నూతన టైమ్‌టేబుల్‌ను అమలు చేయనున్నట్లు భారతీయ రైల్వే విభాగం తెలిపింది. 2025 జనవరి నుంచి కొత్త టైమ్ టేబుల్‌ను అమలు చేయనున్నది. 'ట్రెయిన్ ఎట్ ఎ గ్లాన్స్' 44వ ఎడిషన్‌కు సంబంధించిన ప్రస్తుత టైమ్‌టేబుల్ 2024 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉంటుంది. ఆ తరువాత రోజు నుంచి కొత్త టైమ్‌టేబుల్ అమల్లోకి రానున్నది. 2025 నాటికి మొత్తం 136వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, రెండు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, నమో భారత్ ర్యాపిడ్ రైళ్లను ప్రారంభించాలనే యోచనలో రైల్వే శాఖ ఉంది. అయితే, సాధారణంగా నూతన రైల్వే టైమ్‌టేబుల్‌లో ఏముంటుంది..? కొత్తగా ఎలాంటి మార్పులు వస్తాయి..? తదితర వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. సాధారణంగా రైల్వే శాఖ ప్రతి ఏడాది జూన్ 30 లోపు 'ట్రెయిన్ ఎట్ ఎ గ్లాన్స్' వర్కింగ్ టైమ్ టేబుల్‌ను విడుదల చేస్తుంటుంది. జులై 1 నుంచి ఆ కొత్త టైమ్ టేబుల్ అమల్లోకి వస్తుంది. అయితే ఈ ఏడాది ఆ నిబంధనలను సవరించారు. జనవరి 1 నుంచి కొత్త టైమ్ టేబుల్ అమల్లోకి వచ్చేలా ప్రణాళిక చేశారు. ఇదిలావుంటే మహాకుంభమేళా 2025కు సన్నాహకంగా ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఈ కార్యక్రమానికి హాజరయ్యే లక్షలాది మంది భక్తులకు ప్రపంచస్థాయి సౌకర్యాలను కల్పించేందుకు సిద్ధమైంది. దాదాపు 3 వేల ప్రత్యేక రైళ్లను నడపడంతోపాటు లక్ష మందికిపైగా ప్రయాణికులకు ఆశ్రయం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 10 నుంచి ఫిబ్రవరి 28 వరకు మహాకుంభ్ గ్రామ్‌లో బస కోసం ఆన్‌లైన్ బుకింగ్స్ అందుబాటులో ఉన్నాయి. ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, టూరిజం డిపార్టుమెంట్ వెబ్‌సైట్, మహాకుంభ్ యాప్‌లో అదనపు సమాచారం అందుబాటులో ఉండటంతో.. వాటి ద్వారా సులభంగా రిజర్వేషన్ చేసుకునే అవకాశం ఉంది.



## నటి కారు ఢీకొని వ్యక్తి మృతి..!

**ముంబై:** మహారాష్ట్ర రాష్ట్ర రాజధానిలో దారుణం చోటు చేసుకుంది. మరాఠీ నటికి చెందిన కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. ముంబైలోని కాండీవిల్లీలో నటి ఉర్మిళా కొఠారే కారు ఢీకొని ఓ కార్మికుడు మృతిచెందాడు. శుక్రవారం రాత్రి ఆ నటి షూటింగ్ నుంచి తన కారులో ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో మెట్రో ప్రాజెక్టులో పనిచేస్తున్న ఇద్దరు కార్మికులపై కారు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందారు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. కారు డ్రైవర్ తోపాటు నటి ఉర్మిలాకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

## అన్నా వర్సిటీలో అత్యాచారంపై మహిళా పోలీస్ అధికారిణిలతో సిట్

### బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం



**చెన్నై:** అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై జరిగిన అత్యాచారం ఘటనపై దర్యాప్తు కోసం మహిళా పోలీస్ అధికారిణులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని మద్రాస్ హైకోర్టు పేర్కొంది. అలాగే బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని శనివారం ఆదేశించింది. తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీ క్యాంపస్‌లో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగింది. బాధితురాలి ఫిర్యాదుతో ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. విద్యార్థి సంఘాలతోపాటు ప్రతిపక్షాలు ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. కాగా, ఈ కేసు దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి బదిలీ చేయాలంటూ మద్రాస్ హైకోర్టు పిటిషన్ దాఖలైంది. జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం, జస్టిస్ వీ లక్ష్మీనారాయణలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై శనివారం విచారణ జరిపింది. కేసు దర్యాప్తు కోసం ముగ్గురు మహిళా ఐపీఎస్ అధికారిణులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేయాలని కోర్టు పేర్కొంది. బాధితురాలికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే బాధిత విద్యార్థిని చదువు ప్రభావితం కాకుండా చూడాలని, అన్నా యూనివర్సిటీ ఆమె నుంచి ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది.

## డబ్ల్యూహెచ్‌వో చీఫ్‌కు తప్పిన పెనుప్రమాదం

- సనా ఎయిర్‌పోర్ట్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులు
- అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడిన టెడ్రోస్



**యెమెన్:** ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధానోమ్ త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. యెమెన్‌లోని సనా అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానం ఎక్కేందుకు వేచి ఉండగా వైమానిక బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో విమానాశ్రయంలో ఉన్న ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, ఖైదీల విడుదలపై చర్చలు, యెమెన్‌లో ఆరోగ్యం, మానవతా పరిస్థితులను అంచనా వేసేందుకు టెడ్రోస్ ఐక్యరాజ్యసమితికి చెందిన ఉద్యోగులతో కలిసి అక్కడికి వెళ్లారు. చర్చల అనంతరం తిరుగు ప్రయాణంలో విమానం కోసం సనా అంతర్జాతీయ విమానాశ్రయానికి ఆయన చేరుకున్నారు. v వైమానికి బాంబు దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. అదృష్టవశాత్తూ టెడ్రోస్ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ దాడిని ఐక్యరాజ్యసమితి తీవ్రంగా ఖండించింది.

## బీజేపీ, కాంగ్రెస్‌లు ఆప్‌ను అడ్డుకుంటున్నాయి

### బీజేపీ భయాందోళనలకు గురవుతోంది మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్



**ఢిల్లీ:** బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ ప్రతిపాదించిన పథకాలను ఆపేందుకు ఈ రెండు పార్టీలు కలిసి పని చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రతిపాదించిన సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ ఫిర్యాదు చేశారు. దీంతో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అంశానికి సంబంధించి అరవింద్ కేజ్రీవాల్ శనివారం స్పందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్‌లపై మండిపడ్డారు. ఢిల్లీ ఎన్నికలకు ముందు మహిళలు, వృద్ధుల కోసం ఆప్ ప్రతిపాదించిన పథకాలను ఆపడానికి రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. బీజేపీకి నేరుగా వ్యవహరించే ధైర్యం లేకపోవడంతో కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్‌తో ఫిర్యాదు చేయించిందన్నారు. ఆప్‌ను అడ్డుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఇదిలా ఉంటే.. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తరువాత మహిళలకు రూ.2,100 ఇస్తామన్నారు. అదేవిధంగా 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఉచిత వైద్యం అందిస్తామని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. ఈ రెండు పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే లక్షల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. దీనిపట్ల బీజేపీ భయాందోళనలకు గురవుతోందంటూ ఆయన విమర్శించారు.


## నితీశ్ కుమార్ కూటమి మారబోతున్నారా?

### సమాధానమిచ్చిన మాజీ డిప్యూటీ సీఎం..పలువురి చేతిలో ఆయన బందీగా మారారు



**పట్నా:** బీహార్ రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్ పై మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. నితీశ్ పాలనపై పరోక్షంగా అసంతృప్తిని వ్యక్తం చేశారు. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... నితీశ్ కుమార్ కూటమి మారబోతున్నారా? అంటూ విలేకరుల అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. అది కేవలం ఊహాగానాలు మాత్రమేనని అన్నారు. అయితే, ఆయన ఎప్పుడు ఎక్కడ ఉంటారో ఎవరికీ తెలియదంటూ పెదవి విరిచారు. నితీశ్ సీఎంగా రాష్ట్రాన్ని సమర్థవంతంగా నడపలేకపోతున్నారని తేజస్వీ పేర్కొన్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినటువంటి విషయాల్లో నితీశ్ సొంతంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని, పలువురి చేతిలో ఆయన బందీగా మారారన్నారు. బిహార్ ప్రజలు ఇంకా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందోనంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

## పురాతన ఆలయంలో భారీ అగ్నిప్రమాదం




భోపాల్: మధ్యప్రదేశ్ లోని వందల ఏళ్ల నాటి పురాతన రామాలయంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మంటలకు ఆ గుడి పూర్తిగా కాలిపోయింది. ఆలయంలోని దేవుడి విగ్రహాలు కాలి దెబ్బతిన్నాయి. గ్రామస్తులతోపాటు ఫైర్ సిబ్బంది పలు గంటలపాటు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఖాండ్వా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. భామ్‌గఢ్ గ్రామంలో 500 ఏళ్ల కిందట రాజులు నిర్మించిన రామాలయంలో శుక్రవారం తెల్లవారు జామున 1.30 గంటల సమయంలో మంటలు వ్యాపించాయి. మంటలను గమనించిన గ్రామస్తులు పూజారిని నిద్రలేపి విషయం చెప్పారు. అనంతరం ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితే, చెక్కతో నిర్మించిన ఆ గుడి అంతటా మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు గ్రామస్తులు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. ఖాండ్వా నుంచి రెండు, హర్సూద్ నుంచి ఒక అగ్నిమాపక వాహనాలతో వచ్చిన సిబ్బంది మంటలను ఆర్పివేశారు. భారీగా ఎగిసిపడిన మంటలకు ఆలయం పూర్తిగా కాలిపోయింది. దేవుడి విగ్రహాలు కూడా దెబ్బతిన్నాయి. ఆలయంలో వెలిగించిన దీపం వల్ల మంటలు వ్యాపించి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. అయితే, గుడి వెనుక చెత్త కుప్పల నుంచి మంటలు చెలరేగినట్లు గ్రామస్తులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు.

## రోటీల కోసం పెళ్లి క్యాన్సిల్ చేసిన వరుడు

### మరో అమ్మాయితో వివాహం..పోలీసులకు ఫిర్యాదు చేసిన వధువు బంధువులు

**యూపీ:** విందు ఆలస్యమవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుడు, అతడి కుటుంబ సభ్యులు పెళ్లిని రద్దు చేసుకుని వేదిక నుంచి వెళ్లిపోయారు. అనంతరం మరో అమ్మాయిని వరుడు వివాహం చేసుకున్నాడు. ఇది తెలుసుకున్న వధువు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యూపీలోని చందౌలీ జిల్లాలో ఈ సంఘటన చోటు చేసుకుంది. డిసెంబర్ 22న తన కుటుంబం, బంధువులతో కలిసి వరుడు మెహతాబ్ పెళ్లి ఊరేగింపుగా హమీద్‌పూర్ గ్రామానికి చేరుకున్నాడు. అయితే పెళ్లి భోజనం జాప్యం, రోటీలు ఆలస్యంగా వడ్డించడంపై వరుడు, అతడి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, వారికి నచ్చజెప్పేందుకు వధువు కుటుంబం ప్రయత్నించారు. అయినప్పటికీ వారు వినిపించుకోలేదు. పెళ్లిని మధ్యలోనే ఆపేసి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. కాగా, అదృశ్యమైన వరుడు మెహతాబ్ అదే రాత్రి బంధువైన మరో మహిళను పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి వధువు కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో డిసెంబర్ 24న జిల్లా ఎస్పీని కలిశారు. పెళ్లి కోసం రూ. 7 లక్షల వరకు ఖర్చు చేశామని, వరుడికి కట్నంగా రూ.1.5 లక్షలు ఇచ్చినట్లు వారు ఆరోపించారు. పెళ్లిని మధ్యలో వదిలేసి మరో మహిళను పెళ్లాడిన వరుడు మెహతాబ్, అతడి కుటుంబంపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని ఎస్పీని వధువు బంధువులు కోరారు.



## జనవరి 20 నుంచి దావోస్ సదస్సు..

### ఏడుగురు కేంద్ర మంత్రులు.. ముగ్గురు సీఎంలతో భారత్ ప్రతినిధి బృందం.. చర్చనీయాంశాలివే..!

ప్రతి ఏడాది మాదిరిగానే 2025లోనూ దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు జరగనున్నది. వచ్చే జనవరి 20 నుంచి ఐదు రోజులు జరిగే ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సుకు ఏడుగురు కేంద్ర మంత్రులు, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు హాజరు కానున్నారు. కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, సీఆర్ పాటిల్, చిరాగ్ పాశ్వాన్, కే రామ్మోహన్ నాయుడు, జయంత్ చౌదరి హాజరవుతారు. వీరితోపాటు ముగ్గురు ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్ (మహారాష్ట్ర), నారా చంద్రబాబు నాయుడు (ఆంధ్రప్రదేశ్), ఏ రేవంత్ రెడ్డి (తెలంగాణ)తోపాటు వందలాది మంది ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు హాజరు కానున్నారు.

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తన కొడుకు - మంత్రి నారా లోకేష్ తో కలిసి ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సుకు హాజరవుతారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్, తమిళనాడు మంత్రి టీఆర్‌బీ రాజా, ఉత్తరప్రదేశ్ మంత్రి సురేశ్ ఖన్నా పాల్గొంటారు. 2025 జనవరి 20 నుంచి ఐదు రోజుల పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల అధ్యక్షులు, ప్రధాన మంత్రులు, ఐక్యరాజ్యసమితి, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, ఇంటర్ పోల్, నాటో, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, డబ్ల్యూటీఓ అధికారులు హాజరవుతారు. బంగ్లాదేశ్ ప్రభుత్వ ప్రధాన సలహాదారు తాత్కాలిక ప్రభుత్వాధినేత మహ్మద్ యూనస్ సహా పాకిస్థాన్, బంగ్లాదేశ్ సీనియర్ మంత్రులు కూడా పాల్గొంటారు.

ప్రభుత్వ అధినేతలు, అధికారులతోపాటు దిగ్గజ కార్పొరేట్ సంస్థల అధిపతులు కూడా సదస్సులో పాల్గొంటారని భావిస్తున్నారు. రిలయన్స్, టాటా సన్స్, అదానీ గ్రూప్, బిర్లా, భారతీ, మహీంద్రా, గోద్రేజ్, జిందాల్, బజాజ్, వేదంతా గ్రూపు సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. ముకేశ్ అంబానీ, గౌతం అదానీల భవిష్యత్ తరం ప్రతినిధులు, ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్, విప్రో నుంచి రిషాద్ ప్రేమ్ జీ, రెన్యూ సుమంత్ సిన్హా, పేటీఎం విజయ్ శేఖర్ శర్మ, సీరం ఇన్ స్టిట్యూట్ సీఈఓ అదార్ పూనావాలా తదితరులు పాల్గొంటారు.

ఈ సదస్సులో నైతికంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వాడకం, భూతాపం వంటి ఉమ్మడి సవాళ్లు, అధిక రుణ భారం, తక్కువ వృద్ధిరేటు నుంచి బయట పడే మార్గాలపై డబ్ల్యూఈఎఫ్ సదస్సులో చర్చిస్తారు. ఏఐ, క్వాంటం టూ ఎనర్జీ టెక్, బయోటెక్, హెల్త్ టెక్ వంటి ఇంటర్ కనెక్టెడ్ టెక్నాలజీస్‌తో ఉత్పాదకత పెంపు, జీవన ప్రమాణాల పెంపుదల తదితర అంశాలపై చర్చిస్తారు.

## స్పిరిట్ ఎయిర్ లైన్స్ టూ బైజూస్ వరకూ.. దివాళా పిటిషన్ దాఖలు చేసిన కంపెనీలివే..!

కాలం కలిసి వస్తే ఎవరికైనా లాభాలు వచ్చి పడతాయి. స్కోప్ ఉన్నా, కంపెనీలు కుదేలవుతుండటం కనిపిస్తూనే ఉంటుంది. 2024లో పలు టాప్ కంపెనీలు రుణ బాధలు భరించలేక దివాళా ప్రక్రియ ప్రకటిస్తున్నాయి. ఆ జాబితాలో యూఎస్ బడ్జెట్ క్యారియర్ స్పిరిట్ ఎయిర్ లైన్స్ మొదలు ఎడ్యు టెక్ సంస్థ బైజూ వరకూ పలు సంస్థలు దివాళా ప్రక్రియ ప్రారంభిస్తున్నాయి. మరి కొన్ని దివాళా ప్రక్రియకు అనుమతించాలని కోరుతున్నాయి.

**స్పిరిట్ ఎయిర్ లైన్స్ ఇలా.**

అమెరికాలోనే అతిపెద్ద విమానాల సంస్థ 'స్పిరిట్ ఎయిర్ లైన్స్' కరోనా మహమ్మారి దెబ్బతో కుదేలయింది. కరోనా తర్వాత వరుస నష్టాలు, మోయలేని రుణ భారంతో గత నవంబర్ నెలలో చాప్టర్ 11 దివాళా ప్రక్రియకు పిటిషన్ దాఖలు చేసింది. 2020 నుంచి 2.5 బిలియన్ డాలర్లు కోల్పోయింది. ఇందులో 2025 26లో రుణ బకాయిల చెల్లింపే 100 కోట్ల డాలర్లు.

**ఇదీ బైజూ పరిస్థితి**


భారత్ లోని ఎడ్యుటెక్ సంస్థ బైజూస్ గత ఫిబ్రవరిలో 120 కోట్ల డాలర్ల రుణం చెల్లించలేక దివాళా తీసింది. ఈ మేరకు గత ఫిబ్రవరిలో దివాళా పిటిషన్ దాఖలు చేసింది. మాతృసంస్థతో న్యాయ పోరాటానికి సరిపడా నిధుల్లేవని బైజూస్ సీఈఓ థిమోథీ పోహి తెలిపారు.

**గృహోపకరణాల బ్రాండ్ టప్పర్ వేర్ ఇలా**

ప్రముఖ గృహోపకరణాలు కం స్టోరేజీ బ్రాండ్ టప్పర్ వేర్ సైతం గత సెప్టెంబర్‌లో దివాళా పిటిషన్ వేసింది. ఎర్ల్ టప్పర్ ఎయిర్ టైట్ ప్లాస్టిక్ కంటైనర్ల కోసం 1946లో ఈ కంపెనీ స్థాపించారు. ప్రారంభం నుంచి 500 మిలియన్ డాలర్ల నుంచి 100 కోట్ల డాలర్లకు పెరిగింది. కానీ అప్పులు కూడా 100 కోట్ల డాలర్ల నుంచి 10 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. సూక్ష్మ, ఆర్థిక పరిస్థితుల వల్ల ఏండ్ల తరబడి ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటుందని సీఈఓ అన్ గోల్డ్ మాన్ తెలిపారు.

**ఆర్థిక సవాళ్లతో నార్త్ వోల్ట్..**

ఆర్థిక సంక్షోభాల్లో చికుకున్న నార్త్ ఓల్ట్ అనే స్వీడన్ బ్యాటరీ తయారీ సంస్థ గత నవంబర్ నెలలోనే అమెరికా దివాళా ప్రక్రియ కోసం దాఖలు చేసింది. ఎలక్ట్రిక్ వెహికల్ తయారీ సంస్థగా ఎదగాల్సిన దశలో సరిపడా నిధుల్లేక, కస్టమర్లను కోల్పోవడం వంటి కారణాలతో చాప్టర్ 11 కింద దివాళా పిటిషన్ వేసింది. సుమారు 580 కోట్ల డాలర్ల రుణం ఉంటుందని సమాచారం.



### ఇలా ఆంగ్లో అమెరికన్ కాస్మోటిక్స్ అవోన్

ఆంగ్లో అమెరికన్ కాస్మోటిక్స్, స్కిన్ కేర్, పెర్ఫ్యూమ్, పర్సనల్ కేర్ వస్తువుల తయారీ సంస్థ అవోన్.. దివాళా పిటిషన్ దిశగా అడుగులేస్తున్నది. గత ఆగస్టులో వరుసగా అవోన్ కంపెనీపై లా సూట్లు పడటమే దీని కారణం. టాల్క్ బేస్డ్ పౌడర్ వాడటం వల్ల క్యాన్సర్ కారకం అవుతుందని 200కి పైగా పిటిషన్లు దాఖలయ్యాయి.

## క్రీడా వార్తలు | SPORTS NEWS

# నితీశ్ రెడ్డి సూపర్ సెంచరీ

### టెస్ట్ కెరీర్‌లో తొలి శతకం



**మెల్‌బోర్న్:** మెల్‌బోర్న్‌లో తెలుగు కుర్రాడు నితీశ్ రెడ్డి అద్భుతం సృష్టించాడు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకున్నాడు. సీనియర్లంతా నిరాశపర్చినా ఆసీస్ బౌలర్లను ఆడుకున్నాడు. ఒక సిక్స్, 9 ఫోర్లతో సెంచరీతో కదం తొక్కాడు. ఆల్‌రౌండర్లు జడేజా, సుందర్ సహకారంతో జట్టు స్కోరును 350 దాటించాడు. 99 రన్స్ వద్ద ఫోర్ కొట్టి టెస్టుల్లో ఘనంగా తొలి సెంచరీ నమోదుచేశాడు. ఈ సందర్భంగా ప్రేక్షకుల్లో ఉన్న నితీశ్ తండ్రి భావోద్వేగానికి లోనయ్యారు. కుమారుడి శతకం చూసిన ఆనందంతో కన్నీరు పెట్టుకున్నారు. ఎనిమిదో స్థానంలో అత్యధిక పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్ నిలిచాడు. ఇంతకుముందు అనిల్ కుంబ్లే ఈ ఘనత సాధించాడు.

ఇక వాషింగ్టన్ సుందర్ 50 పరుగులు చేసిన కాసేపటికే వెనుతిరిగాడు. నితీశ్‌తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 127 పరుగుల భాగస్వామ్యం నిర్మించాడు. నాథన్ లియాన్ బౌలింగ్‌లో స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి 8వ వికెట్‌గా ఔటయ్యాడు. అయితే ఆ తర్వాత వచ్చిన బుమ్రా కూడా నిరాశపర్చాడు. ప్రస్తుతం సిరాజ్ (2), నితీశ్ (105) క్రీజులో ఉన్నారు. 9 వికెట్ల నష్టానికి 358 రన్స్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో మరో 116 రన్స్ చేయాల్సి ఉంది.

### మెల్‌బోర్న్‌సెంచరీ వీరుడు నితీష్‌రెడ్డికి ఏసీఏ భారీ నజరానా

అమరావతి : మెల్‌బోర్న్‌లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న బాక్సింగ్ డే టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్‌లో శనివారం మూడో రోజు సెంచరీ చేసిన విశాఖ కుర్రాడు నితీష్‌రెడ్డిని ఆంధ్ర క్రికెట్ అసోషియేషన్(ఏసీఏ) అభినందిస్తూ నజరానా ప్రకటించింది. ఏసీఏ తరుపున రూ.25 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తామని ఏసీఏ అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రకటించారు.త్వరలోనే సీఎం చేతుల మీదుగా నగదు బహుమతిని అందిస్తామని వెల్లడించారు. దేశంలోనే అత్యాధునిక వసతులతో అమరావతిలో స్టేడియాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడేలా విశాఖ స్టేడియం సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు . ఏపీకి కూడా ఐపీఎల్ టీమ్ ఉండేలా ఏసీఏ ఆలోచన చేస్తోందని అన్నారు.




### టాప్‌లో గోవర్ధన్, శ్రవణ్

#### హోరాహోరీగా రాష్ట్ర స్థాయి సెయిలింగ్ పోటీలు

హైదరాబాద్, ఆట ప్రతినిధి : తెలంగాణ సెయిలింగ్ చాంపియన్‌షిప్ పోటీలు హుసేన్‌సాగర్ వేదికగా హోరాహోరీగా సాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం జరిగిన పోటీల్లో టాప్‌సీడ్ సెయిలర్లు గోవర్ధన్, శ్రవణ్ సత్తాచాటారు. సబ్‌జూనియర్ అప్టిమిస్టిక్ క్లాస్ ఆఫ్ బోట్లలో, జూనియర్ సెయిలర్లు అప్టిమిస్టిక్ క్లాస్‌ఆఫ్ బోట్లలో పోటీపడ్డారు. హైదరాబాద్‌కు చెందిన గోవర్ధన్..సబ్‌జూనియర్ ఓవరాల్ అప్టిమిస్టిక్ కేటగిరీలో స్థిరమైన ప్రదర్శనతో ఆధిక్యం కనబరిచాడు. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకొచ్చి పసిడి పతకానికి చేరువయ్యాడు. ఇదే రేసులో దీక్షిత రెండు రేసుల్లో నిరాశపరిచి రెండో స్థానంలో కొనసాగుతున్నది. దీక్షిత సోదరి లాహిరి..సబ్‌జూనియర్ ఓవరాల్ అప్టిమిస్టిక్‌లో మూడో స్థానానికి పడిపోయింది. మరోవైపు జూనియర్ లేజర్ ఫ్లీట్‌లో నల్గొండకు చెందిన శ్రవణ్ కత్రావత్ ఒక రేసు మినహా అన్నింటిలో గెలిచి టాప్‌లో నిలిచాడు. బాలికల జూనియర్ లేజర్ ఫ్లీట్‌లో మాన్య అగ్రస్థానం దక్కించుకుంది.




### శభాష్ నితీష్

#### అభినందనలు తెలిపిన ఏపీ మంత్రి నారా లోకేష్

**అమరావతి :** భారత్, ఆస్ట్రేలియా మధ్య మెల్‌బోర్న్‌లో జరుగుతున్న బాక్సింగ్ డే టెస్ట్ మ్యాచ్‌లో మూడో రోజు సెంచరీ చేసిన విశాఖ కుర్రాడు పై అభినందనలు వ్యక్తమవుతున్నాయి. భారత్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో వికెట్లు పడుతున్న సమయంలో ఓపికగా పిచ్‌పై నిలబడి ఫాస్ట్‌బౌలర్లను సైతం ధాటిగా ఎదుర్కొని సెంచరీ చేయడం పట్ల ఏపీ మంత్రి నారా లోకేష్ ట్విటర్ వేదిక ద్వారా అభినందనలు తెలిపారు. మెల్‌బోర్న్‌లో వైజాగ్ అబ్బాయి నితీష్ కుమార్ రెడ్డి సెంచరీ చేయడం గర్వంగా ఉందని అన్నారు. ఆసీస్‌పై ఒత్తిడిలో అద్భుతమైన ధైర్యం, పట్టుదల, సంకల్ప శక్తిని ప్రదర్శించి తొలి సెంచరీని సాధించినందుకు మిమ్మల్ని చూసి గర్విస్తున్నామని పేర్కొన్నారు. తన పోరాటాన్ని ఇలానే కొనసాగించాలని సూచించారు. మీరు చేసే ప్రతి పరుగును చూసి ఆనందిస్తామని 2024 సంవత్సరం ముగింపులో తన బ్యాట్‌తో ఆంధ్రప్రదేశ్ గొప్పతనాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటినందుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

### తెలుగోడి దెబ్బ

మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్.. 150 ఏళ్ల ఘనచరిత్ర ఉన్న స్టేడియం. ఆస్ట్రేలియాలో అత్యంత జనాదరణ గల మైదానం. ఇక్కడ టెస్ట్ మ్యాచ్ ఆడాలనేది కంగారూ ప్లేయర్లతో పాటు ఎందరో ఇతర దేశ ఆటగాళ్ల కల. ఇక్కడ పది పరుగులు కొట్టినా జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. కాకలుదీరిన ఆసీస్ బౌలర్లను తట్టుకొని ఈ పిచ్‌పై పరుగులు చేయడం అంత సులువు కాదు. రాకాసి బౌన్సర్లు, మెలికలు తిరుగుతూ వచ్చే స్వింగర్లు, నిప్పులు చెరిగే యార్కర్లకు తోపు బ్యాటర్లు కూడా భయపడతారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ లాంటి దిగ్గజాలతో పాటు కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ వంటి స్టార్లు కూడా కంగారూల ధాటిని తట్టుకోలేక చేతులెత్తేశారు. కానీ ఆ ఒక్కడు నిలబడ్డాడు. పట్టుదలతో ఆడుతూ ఆస్ట్రేలియా బెండు తీశాడు. తెలుగోడి పొగరు ఏంటో చూపించాడు. సెంచరీ బాది మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. అతడే తెలుగుతేజం నితీష్ కుమార్ రెడ్డి.



### రియల్ ఫైటర్

వయసు 21. ఆడుతోంది కెరీర్‌లో నాలుగో టెస్టే. ఆస్ట్రేలియాలో ఆడిన అనుభవం లేదు. రోహిత్, విరాట్ సహా సీనియర్లంతా పెవిలియన్‌కు చేరుకున్నారు. మరో కుర్రాడు వాషింగ్టన్ సుందర్ అవతలి ఎండ్‌లో ఉన్నాడు. అతడూ టీమ్‌లో పర్మినెంట్ బెర్త్ కోసం పోరాడుతున్న ప్లేయరే. ఎదురుగా మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్, బోలాండ్, నాథన్ లియాన్ లాంటి స్టార్ బౌలర్లు. చిన్న తప్పు చేసినా ఔట్ అవడం ఖాయం. ఫాలో ఆన్ గండంతో టీమ్ కొట్టుమిట్టాడుతోంది. ఈ తరుణంలో క్రీజులోకి వచ్చిన నితీష్ రెడ్డి స్టన్నింగ్ బ్యాటింగ్‌తో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. 176 బంతుల్లో 10 బౌండరీలు, 1 సిక్స్ సాయంతో 105 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. సుందర్ (50) సాయంతో జట్టును ఆదుకున్నాడు. ఫాలో ఆన్ భయంలో ఉన్న జట్టును ఇప్పుడు పోరాడితే విజయం తథ్యం అనే స్థాయికి తీసుకొచ్చాడు.

### ప్రభాస్-బన్నీ స్టైల్‌లో..

కమిన్స్-స్టార్క్ ద్వయంతో పాటు స్పిన్నర్ లియాన్‌ను పిచ్చ కొట్టుడు కొట్టాడు నితీష్. ఎంతో ఎక్స్‌పీరియెన్స్ ఉన్న బ్యాటర్‌లా ఆడాడు. అడ్డగోలు షాట్లకు పోకుండా మొదట క్రీజులో నిలదొక్కుకునేందుకు ప్రయత్నించాడు. ఒక్కసారి గురి కుదిరాక.. బాల్ మెరిట్‌ను బట్టి షాట్లు ఆడుతూ పోయాడు. బౌలర్ ఎవరనేది పట్టించుకోకుండా చెత్త బాల్ పడితే శిక్షించాడు. ఓటమి అంచున ఉన్న జట్టును కాపాడి.. గెలుపుపై అంచనాలు పెంచాడు. హాఫ్ సెంచరీ పూర్తయ్యాక 'పుష్ప' మూవీలోని అల్లు అర్జున్ సిగ్నేచర్ స్టైల్‌లో బ్యాట్‌తో తగ్గేదేలే అంటూ బ్యాట్‌తో గడ్డాన్ని సవరించాడు. మూడంకెల మార్క్‌ను అందుకోగానే 'బాహుబలి', 'సలార్'లో ప్రభాస్ మాదిరిగా బ్యాట్‌ను నేలకు ఆనించి.. పైకి చూసి దేవుడ్ని తలచుకున్నాడు. అతడి బ్యాటింగ్, టాలీవుడ్ పొగరు చూపిస్తూ చేసిన సెలబ్రేషన్స్, స్వాగ్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఇదీ తెలుగోడి దెబ్బ అని నితీష్ సెలబ్రేషన్, ఇన్నింగ్స్‌ను చూసిన అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

## రియల్‌లైఫ్ స్టోరీతో
# ధనుష్ సినిమా
### అమరన్ దర్శకుడి నుంచి మరో బయోపిక్!



కుబేర, ఇండ్లీ కడై సినిమాలతో బిజీగా ఉన్నారు ధనుష్. మరోవైపు ఆయన కథానాయకుడిగా ఇళయరాజా బయోపిక్ కూడా తెరకెక్కనుంది. ఆ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. ఇదిలావుంటే.. అనుకోకుండా ధనుష్ డైరీలో ఓ కొత్త సినిమా వచ్చి చేరింది. ఇది కూడా బయోపిక్కేనని తెలుస్తున్నది. 'అమరన్' దర్శకుడు రాజ్‌కుమార్ పెరియస్వామి ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నాడని చెన్నై సమాచారం. నిజానికి రాజ్‌కుమార్ ఓ బాలీవుడ్ సినిమాను ఇటీవలే ప్రకటించాడు.అయితే.. ఆ సినిమాకంటే ముందే ధనుష్‌తో సినిమా ఉంటుందని తెలుస్తున్నది. ఈ సినిమా కథ విషయంలో రకరకాల కథనాలు సోషల్‌మీడియాలో వెలువడుతున్నాయి. మనదేశంలో చాలామంది రియల్‌లైఫ్ హీరోలున్నారని, వారి కథలతో సినిమాలు తీస్తే అద్భుతాలు సృష్టించొచ్చని గతంలో రాజ్‌కుమార్ పెరియస్వామి ఓ ఇంటర్వ్యూలో అన్నారు. దానికి తగ్గట్టే ధనుష్‌తో ఆయన చేయబోతున్న సినిమా కూడా రియల్‌లైఫ్ స్టోరీనే అని తెలుస్తున్నది. ఇందులో శ్రుతిహాసన్ కథానాయికగా ఎంపికైందట. మిగతా వివరాలు తెలియాల్సివుంది.



## ఫ్యాన్‌కి ఉరేసుకుని సుసైడ్ చేసుకున్న
# రేడియో జాకీ సిమ్రాన్ సింగ్

జమ్మూకి చెందిన ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లుయెన్సర్, ప్రముఖ రేడియో జాకీ సిమ్రాన్ సింగ్ సుసైడ్ చేసుకుంది. హర్యానా రాష్ట్రం గురుగ్రామ్‌లోని సెక్టార్ 47లో సిమ్రాన్ ఫ్యాన్‌కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయోన్సర్‌గా రేడియో జాకీగా మంచి సిమ్రాన్‌కి మంచి ఫాలోయింగ్ ఉంది. అయితే సుసైడ్ చేసుకున్న విషయాన్ని స్నేహితురాలు గుర్తించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆమెను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఇక సంఘటన స్థలంలో ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని పోలీసులు ప్రకటించారు.






## బాలకృష్ణ డెడికేషన్‌కి
# ఫిదా అవ్వాల్సిందే

బాలకృష్ణ 'డాకు మహారాజ్' సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఇటీవల ఈ సినిమాలోని బాలయ్య పెర్ఫార్మెన్స్ గురించి దర్శకుడు కె.ఎస్.రవీంద్ర(బాబీ) ఆసక్తికరంగా మాట్లాడారు. 'నాకెరీర్‌లో ఇప్పటివరకూ అలాంటి నటుడ్ని చూడలేదు. 'డూప్' అనే పేరెత్తితే ఆయనకు పూనకం వస్తుంది. 60ప్లస్ ఏజ్‌లో కూడా డూప్ లేకుండా నటించడానికే బాలయ్య ఇష్టపడతారు. ఆయన డెడికేషన్‌కి ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే.' అన్నారు. ఇంకా చెబుతూ 'ఇందులో కథానుగుణంగా కొన్ని ఎమోషనల్ సీన్స్ ఉన్నాయి. ఆ సన్నివేశాల్లో బాలయ్య నటన అద్భుతం. నిజంగా ఇలాంటి యాక్టర్ చాలా అరుదుగా ఉంటారు. దర్శకుడిగా నాకు పూర్తి సంతృప్తినిచ్చిన సినిమా 'డాకు మహారాజ్" అని తెలిపారు డైరెక్టర్ కేఎస్ రవీంద్ర. బాలయ్య బ్లాక్‌బస్టర్స్ సమరసింహారెడ్డి, నరసింహనాయుడు, అఖండ సినిమాలను మించి ఈ సినిమా ఉంటుందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ ఇటీవల మీడియా ముఖంగా చెప్పిన విషయం తెలిసిందే. మొత్తంగా దర్శక, నిర్మాతలు ఈ సినిమాపై వ్యక్తపరుస్తున్న అభిప్రాయాలు సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. మరి ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.

# ఎవరో ఒకరు రాజీ పడాల్సిందే!

ప్రేమలో రెండు సార్లు విఫలమైన కారణంగా మనశ్శాంతిని కోల్పోయినట్లుంది చెన్నై చందమామ శ్రుతిహాసన్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రేమ, రిలేషన్, పెళ్లి అంశాలపై ఆమె ప్రస్థావించిన తీరు ప్రస్తుతం చర్చనీయాంశమైంది. 'ప్రేమలో ఉన్నప్పుడు బాగానే ఉంటుంది. అభిప్రాయబేధాల వల్ల అంతరాలు పెరుగుతున్నప్పుడు ఓ బాధ. విడిపోయిన తర్వాత ఓ బాధ. ఇది అనుభవించిన వారికే తెలుస్తుంది. పెళ్లి అనే కట్టుబాటు బంధాలను శాశ్వతం చేస్తుందంటే కూడా నేను నమ్మను. ఎవర్నీ బలవంతంగా కలిపి ఉంచలేం. మా అమ్మానాన్న ప్రేమించే పెళ్లి చేసుకున్నారు. చాలా అందమైన జంట. ఈ ప్రపంచంలో ఉత్తమ జంట మా అమ్మానాన్నే అనుకునేదాన్ని. ఇద్దరూ చాలాకాలం కలిసున్నారు. ఆ టైమ్‌లో మా ఇల్లు చాలా బావుండేది. ఉన్నట్టుండి విడిపోవాల్సిన పరిస్థితులు ఎదురయ్యాయి. అయినా కలిసి ఉండటానికి ప్రయత్నించారు. కానీ కుదర్లేదు. పరిస్థితులకు ఎదురొడ్డి గెలవలేం. ఎవరో ఒకరు రాజీ పడితే తప్ప బంధాలు నిలవవ్. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితుల్లేవ్. అందుకే పెళ్లిపై నాకు సదాభిప్రాయం లేదు' అని తేల్చేసింది శ్రుతిహాసన్.



# బేబీ బంప్‌తో సమంత..

టాలీవుడ్ స్టార్ నటి సమంత గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన అందం, అభినయంతోపాటు నటనతో కోట్లాది మంది అభిమానుల్ని సొంతం చేసుకుంది. ఏమాయ చేశావే చిత్రంతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన ఈ చెన్నై సుందరి.. అతి కొద్ది రోజుల్లోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం మంచి ఫామ్‌లో ఉండగానే టాలీవుడ్ నటుడు నాగచైతన్యను ప్రేమపెళ్లి చేసుకుంది. ప్రస్తుతం అతడితో విడాకులు తీసుకుని సింగిల్‌గా ఉంటోంది. ఈ క్రమంలో సమంతకు సంబంధించిన కొన్ని ఫొటోలు ప్రస్తుతం నెట్టింట షేక్ చేస్తున్నాయి. ఆ ఫొటోల్లో సామ్ బేబీ బంప్‌తో కనిపించడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అయితే, అవి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవిగా తెలిసింది. ఏఐ సాయంతో సమంత బేబీ బంప్ ఫొటోలను క్రియేట్ చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇవి కాస్తా వైరల్ కావడంతో నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. నాగచైతన్యతో విడాకుల అనంతరం మాతృత్వాన్ని అనుభవించాలని ఉందంటూ సామ్ అప్పట్లో చెప్పుకొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు బేబీ బంప్ ఫొటోలు చూసిన వారంతా ఈ విషయాన్నే గుర్తు చేసుకుంటున్నారు.

## మహేశ్ బాబు- రాజమౌళి
# ఛాన్స్ కొట్టేసిన బాలీవుడ్ బ్యూటీ..!

టాలీవుడ్ దర్శక దిగ్గజం ఎస్.ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబోలో SSMB 29 మూవీ తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ మూవీకి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. ఇక షూటింగ్ ప్రారంభం కావడమే ఆలస్యం. మూవీ లవర్స్ కూడా ఈ సినిమా కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. హాలీవుడ్ సినిమాను తలపించేలా ఈ సినిమా ఉండబోతుందని రాజమౌళి ఇప్పటికే హింట్ ఇచ్చాడు. అయితే మహేశ్ బాబు సరసన బాలీవుడ్ బ్యూటీ ఛాన్స్ కొట్టేసినట్లు ఫిలిం ఇండస్ట్రీలో వినిపిస్తోంది. ప్రియాంక చోప్రా ఈ మూవీలో నటిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత SSMB 29 మూవీ షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ కూడా పూర్తయినట్లు సమాచారం. హైదరాబాద్ రామోజీ ఫిల్మ్‌సిటీతోపాటు, నగర శివార్లలో కొన్ని భారీ సెట్లను కూడా రూపొందించారు. తొలి షెడ్యూల్ వాటిలోనే జరుగుతుందట. తర్వాతి షెడ్యూల్ విదేశాలలో ఉంటుందట. ఈ సినిమా అధికారిక ప్రకటనకు సంబంధించిన గ్లింప్స్ ఇప్పటికే సిద్ధమైందని, త్వరలో ఇతర నటీనటుల్ని కూడా పరిచయం చేసే అవకాశం ఉందని చిత్రబృందం చెబుతున్నది. అనవాయితీ ప్రకారం త్వరలోనే ఓ ప్రెస్‌మీట్‌ను కూడా రాజమౌళి పెట్టనున్నారట. వెయ్యికోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలుగా ఈ సినిమాను నిర్మాత కె.ఎల్. నారాయణ నిర్మిస్తున్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com